www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 169 | మంగళవారం 11.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## లాఠీలతో విరుచుకుపడ్డ పోలీసులు

### ఉద్రిక్తంగా మారిన విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి..

13 పరీక్షల రద్దుపై పట్టుబట్టిన విద్యార్థి సంఘాలు




- 16 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు..
- విఫలమైన ఆరు విడతల చర్చలు
- 13 పరీక్షల రద్దుపై పట్టుబట్టిన విద్యార్థి సంఘాలు
- సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలంటూ డిమాండ్
- రాంచీకి పోటెత్తిన వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు
- అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు..
- లాఠీఛార్జ్, వాటర్ కెనాన్ల ప్రయోగం

02

**జార్ఖండ్‌లో ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం.. జేపీ ఎస్సీ మాజీ చైర్మన్ అరెస్ట్**

JPSC మాజీ చైర్మన్ ఎల్. ఖియాంగ్తేను అరెస్ట్ చేశారు. పరీక్షల అక్రమాలపై ఇప్పటికే సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న సీఐడీ.. మాజీ చైర్మన్ అరెస్ట్‌తో దర్యాప్తును మరింత వేగవంతం చేసింది.

## ముగిసిన సర్ ప్రక్రియ..

### ఓటర్లు ఎంతమంది అంటే..?

**రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్**

తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం

2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది




- రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు.. 73.95 లక్షల పేర్లు తొలగింపు
- 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదు
- 94.30 శాతంతో యాదాద్రి భువనగిరి జిల్లా టాప్
- మెదక్ 90.54 శాతం.. సూర్యాపేట 90.43 శాతం
- 58.58 శాతంతో హైదరాబాద్ చివరి స్థానంలో
- మేడ్చల్ 63.82 శాతం.. రంగారెడ్డి 64.91 శాతం
- 89 శాతానికి పైగా డిజిటలైజేషన్ సాధించిన ఆసిఫాబాద్, జగిత్యాల
- గడువు పొడిగించినా హైదరాబాద్, రంగారెడ్డిలో పెరగని శాతం
- 12న SIR ప్రక్రియ పూర్తిపై సీఈవో ప్రకటన
- 17న ముసాయిదా ఓటర్ల జాబితా.. అక్టోబర్ 19న తుది జాబితా

02

## జాతీయ హోదాపై క్లారిటీ.!

### పాలమూరుకు కేంద్రం షాక్..



- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇప్పట్లో లేనట్టే
- రాజ్యసభలో కేంద్రం స్పష్టత.. ప్రతిపాదన పరిశీలనలో లేదని వెల్లడి
- కృష్ణా జల వివాదాల నేపథ్యంలో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్‌కు బ్రేక్
- సమగ్ర ప్రణాళికతో రావాలంటూ డీపీఆర్‌ను వెనక్కి పంపిన కేంద్రం
- నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే జాతీయ ప్రాజెక్టు హోదా

02

## రైతులు ఆందోళనలో ఉన్నారు..

యాసంగి పంటను దృష్టిలో ఉంచుకోండి

### కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి



- కాళేశ్వరం మోటార్లు వెంటనే ఆన్ చేయాలి: హరీశ్‌రావు
- 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలంటూ డిమాండ్
- వర్షాభావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని బహిరంగ లేఖ
- మిడ్ మానేరు నుంచి నీటి పంపింగ్ ప్రారంభించాలని విజ్ఞప్తి
- ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లు నింపాలి
- మిడ్ మానేరులో 22 టీఎంసీల నీటి లభ్యత ఉందన్న హరీశ్‌రావు

03

ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలన్నారు. మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలలో ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని... అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలన్నారు. తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాల కు నీరందించేలా చర్యలు చేపట్టలన్నారు.

## రైతుల భూ హక్కులకు భరోసా..

180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణానికి చర్యలు

**తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల ఎంపిక**

**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం**

- పేదలు, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: పొంగులేటి
- ప్రజలకు చేరువగా పాలన.. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాలకు రూ.600 కోట్ల కేటాయింపు
- 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణానికి చర్యలు
- ధరణి స్థానంలో భూభారతి.. రైతులకు సంపూర్ణ భూ హక్కులు

**ఎల్కతుర్తి సమగ్ర అభివృద్ధికి కృషి: మంత్రి పొన్నం**

03







## సాగర్ తీరాన..

**క్లౌడ్ సీడింగ్‌తో సమానంగా 'కరీరీ ఇష్టి' మంత్రాలు!**

# వరుణుడికి ఆహ్వానం!

### వర్షాలు విస్తారంగా కురవాలని 'మహా వరుణ యాగం'

## మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, నదులు జలకళను సంతరించుకోవాలని కోరుతూ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో 'మహా వరుణ యాగం' నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం పర్యవేక్షణలో 108 మంది వేద పండితులు, 11 హోమగుండాలతో యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రైతాంగం సుభిక్షంగా ఉండాలని, కృష్ణా—గోదావరి నదులు నిండాలని ప్రభుత్వం ఆకాంక్షించింది.

- వర్షాలు విస్తారంగా కురవాలని 'మహా వరుణ యాగం'
- నాగార్జునసాగర్‌లో వైభవంగా ప్రభుత్వ ప్రతిష్టాత్మక యాగం
- కృష్ణా, గోదావరి నదులు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష
- సతీసమేతంగా పాల్గొని వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- 108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలతో శాస్త్రోక్తంగా క్రతువు
- యాదాద్రి దేవస్థానం పర్యవేక్షణలో వైదిక కార్యక్రమాలు
- ఆదిపూజతో యాగాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- వేద మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతితో ముగింపు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి రాష్ట్రస్థాయి మహా వరుణ యాగం
- వర్ష పాశుపత మంత్రాలతో 'కరీరీ ఇష్టి' నిర్వహణ
- క్లౌడ్ సీడింగ్‌తో 'కరీరీ ఇష్టి'కి పోలికలపై పరిశోధకుల ప్రస్తావన

03



## కేంద్రమంత్రికి కేటీఆర్ లేఖ

### తెలంగాణలో మరో భారీ కుంభకోణం

- నిర్మలా సీతారామన్‌కు లేఖ.. స్వతంత్ర సంస్థతో విచారణకు డిమాండ్
- రూ.2,059 కోట్ల ప్రాజెక్టులో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ
- ప్రభుత్వ భూమి, ప్రజాధనాన్ని ప్రైవేట్ డెవలపర్‌కు కట్టబెడుతున్నారని విమర్శ
- ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు స్థలం బిల్డర్‌కు కేటాయించారని ఆరోపణ
- రూ.200 కోట్ల కేంద్ర రుణాన్ని ప్రైవేట్ సంస్థకు మళ్లించే కుట్ర అంటూ విమర్శ
- పారదర్శకత లేని ఒప్పందాలపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్ రాయదుర్గంలో ప్రతిపాదించిన పీఎం ఏక్తా మాల్ టెండర్లలో భారీ ఆర్థిక అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. టెండర్‌ను వెంటనే రద్దు చేసి, సీఏజీ లేదా స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ప్రభుత్వ భూమి, ప్రజాధనాన్ని ప్రైవేట్ డెవలపర్లకు లబ్ధి చేకూరేలా వినియోగిస్తున్నారని ఆయన విమర్శించారు.

03

## కర్రలతో కొట్టి..

### బూట్లతో ముఖంపై తొక్కి

**బూట్లతో ముఖంపై తొక్కి..**



- శ్రీచైతన్య హాస్టల్ లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి
- ఘటనను దాచిపెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నించిందని తల్లిదండ్రుల ఫిర్యాదు
- శ్రీచైతన్యలో ర్యాగింగ్ ఘాతుకం ఒక్క విద్యార్థిపై 12 మంది దాడి

02



# లాఠీలతో విరుచుకుపడ్డ పోలీసులు



**రాంచీ :** ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలలో వరుస పేపర్ లీకేజీలు, అవకతవకలకు నిరసనగా జార్ఖండ్ రాజధాని రాంచీ వేదికగా విద్యార్థులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు పోలీసు బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో, వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. గత 16 రోజులుగా విద్యార్థులు, యువజన సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీతో ఆరు విడతలుగా చర్చలు జరిగినప్పటికీ అవి విఫలమయ్యాయి. తమ డిమాండ్లలో 98 శాతానికి ప్రభుత్వం అంగీకరించిందని అధికారులు చెబుతున్నప్పటికీ, తాము రద్దు చేయమన్న 13 పరీక్షల్లో కేవలం మూడింటికే ప్రభుత్వం ఒప్పుకుందని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్రమైన సీబీఐ విచారణ జరిపించాలనే డిమాండపై వారు పట్టుబట్టారు.

**రాంచీ వైపు పోటెత్తిన యువత..**

సోమవారం నాటి అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు రైళ్లు, బస్సులు, సొంత వాహనాల్లో రాంచీకి చేరుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పరిపాలనా యంత్రాంగం నగరం వ్యాప్తంగా భారీగా పోలీసు బలగాలను మోహరించింది. ప్రధాన రహదారులు, సరిహద్దుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నగరంలో ముందుజాగ్రత్త చర్యగా ఎక్కువ శాతం పాఠశాలలను మూసివేశారు. పోలీసులు బారికేడ్ల వద్ద విద్యార్థులను నిలువరించేందుకు వాటర్ కెనాన్లను ఉపయోగించగా, కొందరు విద్యార్థులు ఏమాత్రం తగ్గకుండా ఆ నీటి ధారల ఎదుటే డ్యాన్స్ చేస్తూ నిరసన తెలపడం ఆకట్టుకుంది. ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, క్రమశిక్షణతో, పోలీసులతో గొడవ పడకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో అసెంబ్లీకి చేరుకోవాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు.

**రాజకీయ ప్రకంపనలు..**

మరోవైపు, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసం వెలుపల భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా నిరసన తెలిపారు. "ఇంటి సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి తప్ప. లాఠీల ద్వారా కాదు" అని సీఎం సోరెన్ పేర్కొంటూ, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఐడీ విచారణ, సమన్ల నేపథ్యంలో జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కి చెందిన ముగ్గురు సభ్యులు నిన్న తమ పదవులకు రాజీనామా చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ప్రస్తుతం ఆరుగురు విద్యార్థి నాయకులు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తుండటంతో రాంచీలో వాతావరణం ఇంకా వేడెక్కే ఉంది.

## జాతీయ హోదాపై క్లారిటీ.!

**ఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది.

**డీపీఆర్ వెనక్కి.. సాంకేతిక అనుమతుల నిలిపివేత**

కృష్ణా నదీ జలాల వినియోగం , అంతర్రాష్ట్ర వివాదాలు ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-II పరిధిలో ఉన్నందున, ప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో-ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో తిరిగి రావాలంటూ డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను కేంద్రం వెనక్కి పంపింది. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

**మార్గదర్శకాల ప్రకారమే హోదా కేటాయింపు**

జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.

# జర్నలిస్టుల భద్రతకోసం...

## జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం చేయాలి - ఐ.జే.యు. డిమాండ్!

## అక్టోబర్ 2 న జాతీయ కోర్కెలదినం!






**బెంగళూరు, ఫ్లాష్ ఇండియా :** జర్నలిస్టుల భద్రతకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. బెంగళూరులో రెండురోజులపాటు జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం ముగిసింది. సమావేశానికి ఐ.జే.యు. జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ అధ్యక్షత వహించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, చట్టపరమైన దాడులు, హింస, పెరిగిపోవడం, వార్తావనరుల గోప్యతకు అవసరమైన చట్టాలు లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో భారతదేశంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు ఒక ప్రత్యేక బలమైన చట్టం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆమోదించిన ఒక తీర్మానంలో డిమాండ్ చేసింది. ఐ.జే.యు. పూర్వాధ్యక్షుడు , తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికి దిగజారి పోవడంపై ఆందోళన వ్యక్తం చేసారు. భారత రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛకు గట్టి హామీ ఇచ్చినప్పటికీ వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం లేకపోవడం వల్లనే బెదిరింపులు, దాడులు పెరిగిపోతున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో జర్నలిస్టుల భద్రతకు ఇప్పటికే ప్రత్యేక చట్టాలు వచ్చినప్పటికీ , అవి అవసరానికి తగినవిధంగా లేవని ఆ తీర్మానం పేర్కొన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమాచార పౌరసంబంధాల బడ్జెట్ ను, వివిధ శాఖలు జారీచేసే ప్రకటనలను అనుకూల ప్రచారం కోసం ఆయుధాలుగా వినియోగించడాన్ని ఆ తీర్మానం ఖండించింది. 1955, 1958 సంవత్సరాల నాటి రెండు వర్కింగు జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో వర్కింగు జర్నలిస్టులకు వృత్తి భద్రత, వేతనభద్రత , మెరుగైన పనిపరిస్థితులు కల్పించేందుకు వీలుగా ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐ.జే.యు. మరో తీర్మానంలో డిమాండ్ చేసింది. వివిధ మీడియా సంస్థలలో కొనసాగుతున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితిని 58 నుండి 60 సంవత్సరాలకు పెంచాలని ఐ.జే.యు. సమావేశం ఆమోదించిన మరో తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఐ.జే.యు. సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ , దేశంలో మీడియా స్థితిగతులపై, గత నాలుగు నెలల్లో యూనియన్ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై పదిహేను రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, దాదాపు ఇరవై మందికి పైగా జాతీయ కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్. ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ. మాజిద్ , జాతీయ ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్, వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శులు డి.ఎస్.ఆర్. సుభాష్, పి. భాస్కర్ రెడ్డి, నరేంద్ర భరద్వాజ్ , కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం. జానకీ మోహన్, ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్ తదితరులు మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 వ తేదీన "జర్నలిస్ట్ డిమాండ్స్ డే" ను దేశవ్యాప్తంగా పాటించాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది. నవంబర్ 16 వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వీర్యమైపోయిన ప్రస్తుత పరిస్థితులపై దేశవ్యాప్త చర్చను లేవనెత్తాలని, సమస్యపై అవగాహన పెంచేందుకు , పటిష్టమైన మీడియా కౌన్సిల్ అవసరాన్ని వివరిస్తూ ప్రచారాందోళనా కార్యక్రమాన్ని చేపట్టాలని, జర్నలిస్టులను, పౌర సమాజ ప్రముఖులను, ప్రజాప్రతినిధులను, న్యాయ నిపుణులను, విద్యావేత్తలను భాగస్వాములను చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు జరపాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది. అక్టోబర్ ఆఖరు వారంలో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సును హైదరాబాద్ లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపులో "కర్ణాటక రాజ్య ప్రశస్తి" పురస్కారాల ప్రదానకార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సమాజంలోని విభిన్న జీవన రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రకటించిన "రాజ్య ప్రశస్తి" పురస్కారాలను ఐ.జే.యు. జాతీయ నాయకుల చేతులమీదుగా ప్రదానం చేశారు.

# ముగిసిన సర్ ప్రక్రియ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## వీబీజీ రామ్ జీ యాక్ట్ ఉపాధి చోరీనే



**ఢిల్లీ:** వీబీజీ రామ్ జీ చట్టం 'ఉపాధి చోరీ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ (మన్‌రేగా)ను తొలగించి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం వల్ల గ్రామీణ కార్మికులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మన్‌రేగా కింద పెండింగ్‌లో ఉన్న రూ. 17,144 కోట్ల నిధులను రాష్ట్రాలకు విడుదల చేసిందా, కరువు ప్రభావిత రాష్ట్రాలకు ఎలాంటి సాయం అందించిందని ఖర్గే ప్రశ్నించారు. ఖరీఫ్ పంటల సాగులో 26.50 శాతం లోటు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఇదే సమయంలో, వీబీజీ రామ్ జీ అమల్లోకి వచ్చిన తొలి నెలైన జూలైలో గ్రామీణ ఉపాధి కల్పన గతేడాది జూలైతో పోలిస్తే దాదాపు 50 శాతం తగ్గిందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పేర్కొన్నారు. పని దినాలు 49.94 శాతం, ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య 51.45 శాతం తగ్గింది. ఈ గణాంకాలు మన్‌రేగాను బలహీనపరిచే నిర్ణయం వల్ల కలిగే ప్రభావాలను చూపిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. జైరాం రమేష్ మాట్లాడుతూ, మన్‌రేగా గ్రామీణ కార్మికులకు చట్టబద్ధమైన ఉపాధి హామీ ఇవ్వడంతో పాటు, దాన్ని అమలు చేయడంలో గ్రామ పంచాయతీలకు కీలక పాత్ర కల్పించిందన్నారు. అయితే వీబీజీ రామ్ జీ ద్వారా వ్యవస్థ మరింత కేంద్రీకృతమైందని, రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరిగిందని, సాంకేతికత, బయోమెట్రిక్ వెరిఫికేషన్‌పై ఆధారపడటం పెరిగిందని ఆయన విమర్శించారు. దీనివల్ల కార్మికులు తమ ఉపాధి హక్కులను పొందడం కష్టమవుతుందని ఆరోపించారు.

# కర్రలతో కొట్టి.. బూట్లతో ముఖంపై తొక్కి

**దమ్మాయిగూడ,ఫ్లాష్ ఇండియా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ లోని శ్రీచైతన్య హైస్కూల్ హాస్టల్లో పదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. కామారెడ్డికి చెందిన అభిషేక్పై సుమారు 12 మంది విద్యార్థులు కర్రలు, ప్లేట్లతో దాడి చేయడంతో పాటు బూట్లతో ముఖంపై తొక్కినట్లు అతడి తల్లిదండ్రులు ఆరోపించారు. తీవ్ర గాయాలపాలైన అభిషేక్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**పోలీసుల దర్యాప్తు**

తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిపై దాడి ఎందుకు జరిగింది? ఎంతమంది పాల్గొన్నారు? ర్యాగింగ్ కారణమా? ఘటనపై పాఠశాల యాజమాన్యానికి ముందే సమాచారం ఉందా? అనే కోణాల్లో విచారణ చేపట్టాల్సి ఉంది. బాధిత విద్యార్థి వాంగ్మూలం, ఇతర విద్యార్థుల వివరాలు, హాస్టల్ పరిస్థితులు, సీసీటీవీ దృశ్యాలు దర్యాప్తులో కీలకం కానున్నాయి. విద్యార్థుల భద్రతకు బాధ్యత వహించాల్సిన హాస్టల్ లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రివేళదాడి?**

తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో హాస్టల్లో అబిపికిపై సుమారు 12 మంది విద్యార్థులు దాడి చేశారని, కష్టాలు, పేఖర్ కొట్టడంతో పాటు టూట్లతో ముఖంపై తొక్కినట్లు తెలిపారు. ఈ ఘటనలో బాబు తీవ్ర గాయాలయ్యాయని, పరిస్థిత్ విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చేర్మించినట్లు చెప్పారు. అయితే తమ రమారుడు మెట్లపై నుంచి జారిపడి కిందపడిపోయాడని పాఠశాల యాజమాన్యం ఫోన్ చేసి చెప్పిందని తల్లిదండ్రులు పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న వెంటనే పాఠశాలకు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చామని, పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆస్పత్రిలో చేర్పించామని తెలిపాడు.

**'ర్యాగింగ్ పేరుతోనే..'**

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అభిషేక్.. తనపై ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారని చెప్పినట్లు తల్లిదం డ్రులు తెలిపారు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘటనను బయటకు రాకుండా దాచిపెట్టేందుకు ప్రయత్నించిన పాఠశాల యాజమాన్యంపైనా చర్యలు తీసుకో వాలని కోరారు

# ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన తల్లి



**మెట్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్ రావుపేట గ్రామంలో ఒకే కాన్పులో ఓ తల్లి ముగ్గురు పిల్లలకు జన్మనించ్చింది. మెట్ పల్లి మండలం రాజేశ్వర్ రావుపేటకు చెందిన జంగిటి రాజలక్ష్మి - నరేందర్ దంపతులు డెలివరీ కోసం సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చారు. వైద్యుల పర్యవేక్షణలో రాజలక్ష్మి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన వారిలో ఒకరు మగబిడ్డ - బరువు 1 కేజీ 800 గ్రాములు, ఇద్దరు ఆడపిల్లలు - ఒక్కొక్కరు 1 కేజీ 500 గ్రాముల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తల్లి, ముగ్గురు పిల్లలు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నారు.

## సమిష్టి కృషితో విజయం సాధ్యం



**తాండూరు,ఫ్లాష్ ఇండియా :** సమిష్టి కృషితో ఎంతటి అసాధ్యాన్నైనా సుసాధ్యం చేసుకొని విజయం దిశగా ముందుకు పయనించవచ్చని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ రావు అన్నారు. సోమవారం ఇటీవల వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన యు. రమేశ్ కుమార్ హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ ను రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ దిశగా పక్కా ప్రణాళికతో , ప్రతి ఒక్కరి కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ మాట్లాడుతూ... పార్టీ బలోపేతమే ధ్యేయంగా బీజేపీని మరింత క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లేందుకు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు కర్ణం ప్రహ్లాద రావు, మాధవరెడ్డి, శివరాజ్, గిరామోని శ్రీనివాస్, శంకర్ నాయక్, సాహు, శ్రీలత, శ్రీధర్ రెడ్డి, వీబీ రెడ్డి, మారుతీ కిరణ్, మిట్ట పరమేశ్వర్, వడ్ల నందు, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, బాలేషం, విజయ్ కృష్ణ ముదిరాజ్, భద్రశ్వర్, కేశవ్లు, యాదవ్, నాగారం మల్లేశం, శిరీష, రాజేందర్ రెడ్డి, వివేకానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# రైతులు ఆందోళనలో ఉన్నారు..

## కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి: ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను వెంటనే ఆన్ చేసి, ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను నీటితో నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నందున రాజకీయాలకు అతీతంగా తక్షణమే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపక పోవడం వల్ల పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు.

**ప్రతి చుక్కను ఒడిసి పట్టండి:**

ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలన్నారు. మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలలో ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని... అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలన్నారు. తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాల కు నీరందించేలా చర్యలు చేపట్టలన్నారు.

**యాసంగి పంటను దృష్టిలో ఉంచుకోండి:**

రైతు సాగు ప్రయోజనాలు తీర్చడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మిడ్ మానేరు నుండి లోయర్ మానేరుకు నీటిని నింపి SRSP STAGE -2 లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని పై రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4లక్షల ఎకరాలు సాగైందని ఈ విషయం గుర్తించి ఈ వానాకాలం పంటకి అదే విధంగా వచ్చే యాసంగి పంటకు కూడ సాగు నీరు అందించేల కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్ నింపాలన్నారు.



# గుండ్లపల్లి స్టేజి వద్ద ఉద్రిక్తత

**గన్నేరువరం,ఫ్లాష్ ఇండియా :** "కవ్వంపల్లికి హటావో మానకొండూరు బచావో, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాజీనామా చేయాలి. డౌన్ డౌన్ కవ్వంపల్లి" అనే నినాదాలతో రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి దద్దరిల్లింది. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతూ బీజేపీ శ్రేణులు గుండ్లపల్లి స్టేజి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులను శాంతింప చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, మానకొండూరు నియోజకవర్గం కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డిలు మాట్లాడుతూ.. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికై గతంలో యువజన సంఘాలు పోరాడితే ఆ పోరాటాన్ని కవ్వంపల్లి సత్యనారాయణ హైజాక్ చేశారని అన్నారు. డబుల్ రోడ్డు నినాదంతో ఓట్లు సంపాదించి గెలిచిన తర్వాత రోడ్డు అంశాన్ని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. గెలిచి మూడు సంవత్సరాలుగా వస్తున్న ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం పట్ల పలు విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో మాట్లాడి రోడ్డు కోసం నిధులు మంజూరు చేయించలేని ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గుంతలు పడిన రోడ్డుతో కంకర కుప్పలతో రోడ్డు పక్క ప్రమాదభరితమైన బావులతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, సొల్లు అజయ్ వర్మ, విలాసాగరం రామచంద్రం, మచ్చ సాయి, పుల్లెల జగన్, పుల్లెల రాము, గాలి పెల్లి శంకర్, గూడెల్లి మల్లేశం అధిక సంఖ్యలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# మతం పేరు చెప్పుకుని బతకడమే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని బతకడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడమే బీజేపీ నాయకుల పని అని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అద్భుతంగా బోనాల పండుగ జరిగిందని ఈ పండగ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి గుడిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి బోనం, పట్టువస్త్రాలను సమర్పించాన్నారు. అలాంటిది బండి సంజయ్ బోనాల పండుగను కూడా రాజకీయం కోసం ఉపయోగించుకోవడం సంస్కృతి కాదన్నారు. ఈ మేరకు ఇవాళ మాట్లాడిన ఆది శ్రీను.. తెలంగాణ గౌరవానికి బోనాల పండుగ చాలా ప్రత్యేకమైనదని, అటువంటి బోనాల పండుగకు ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదని బండి సంజయ్ నిన్న చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

**ప్రాచీన దేవాలయాలు పునరుద్ధరణ:**

బోనాల కోసం ప్రతి గుడికి నిధులు ఇచ్చామని, రేవంత్ రెడ్డి హయాంలోనే రాష్ట్రంలోని పలు దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడటం కోసం ప్రాచీన దేవాలయాలను పునరుద్ధరిస్తున్నట్టు చెప్పారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని రూ. 250 కోట్లతో పునర్నిర్మిస్తున్నామని, బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని రూ.225 కోట్ల అంచనా వ్యయంతో పునర్నిర్మిస్తున్నట్టు చెప్పారు. కాళేశ్వరం దేవాలయం పునర్నిర్మాణం కోసం రూ. 250 కోట్లు కేటాయించామని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.50 కోట్లు, భద్రాచలం పునర్నిర్మాణం కోసం రూ.351 కోట్ల, గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించి ఇప్పటికే రూ. 300 కోట్లు విడుదల చేశామన్నారు. గోదావరి పుష్కరాల్లో గోదావరి వెంట ఉన్న 96 పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కపల్లిలో రూ.157 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో గోశాల, వేములవాడలో 40 ఎకరాల్లో అధునాతన గోశాలను నిర్మిస్తున్నామన్నారు.

**చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురా:**

దాదాపు రెండున్నర వేల కోట్ల రూపాయలను కూడా హిందూ దేవాలయాల అభివృద్ధి కోసం మా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ స్థాయిలో హిందూ దేవాలయాల అభివృద్ధి జరుగుతుందా? ఇంత పెద్ద ఎత్తున గుళ్లకు నిధులు కేటాయించారా? బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ, మా ప్రభుత్వం సెక్యులర్ అని తాము అన్ని మతాలను గౌరవిస్తామన్నారు. ఓట్ల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టే విధానం మా కాంగ్రెస్ పార్టీది కాదన్నారు. బండి సంజయ్‌కి నీకు చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేసి మాట్లాడాలన్నారు.

# రైతుల భూ హక్కులకు భరోసా..

**ఎల్కతుర్తి,ఫ్లాష్ ఇండియా :** పేదల సంక్షేమం, రైతుల భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రూ. 3.25 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి అవసరమైన కార్యాలయ భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి సుమారు రూ. 600 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సుమారు 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులు, భూ యజమానులకు భూములపై సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు పారదర్శకమైన విధానంలో భూభారతి ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి భూ పార్సిల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు భౌగోళిక కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్‌ను రూపొందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల సహకారంతో భూ సర్వేను పూర్తి చేసి భవిష్యత్తులో భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలు తలెత్తకుండా శాశ్వత భూ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఎల్కతుర్తి సమగ్ర అభివృద్ధికి కృషి: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎల్కతుర్తి మండల ప్రజలు చాలాకాలంగా ఎదురుచూస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడతామని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయ భవన పనులను పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. దీనికి స్పందించిన పొంగులేటి.. అవసరమైన అదనపు నిధులను ఈ వారంలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ రవి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, స్థానిక సర్పంచ్ మునిగడప లావణ్య శేషగిరి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, గోలి రాజేశ్వరరావు, డాక్టర్ రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో గందరగోళం..

## పొంగులేటి ప్రసంగానికి కౌశిక్ రెడ్డి అడ్డంకి!

**కమలాపూర్,ఫ్లాష్ ఇండియా :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో గందరగోళం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, భవన నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, ప్రస్తుతం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తూ అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. అయితే పొంగులేటి ప్రసంగిస్తున్న సమయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆయనను వారిస్తూ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందంటూ కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో సభా ప్రాంగణంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు 'కౌశిక్ ఖబడ్దార్' అంటూ నినాదాలు చేయగా.. బీఆర్ఎస్ కార్యకర్తలు 'కౌశిక్ జిందాబాద్' అంటూ ప్రతిగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ సభా వేదిక వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ పరిణామంతో సభా ప్రాంగణం ఒక్కసారిగా గందరగోళంగా మారింది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు జోక్యం చేసుకున్నారు. దీంతో మంత్రి పొంగులేటి తన ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపివేశారు. అనంతరం 'ఇది ప్రజా ప్రభుత్వం.. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం' అని పేర్కొంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# సాగర్ తీరాన.. వరుణుడికి ఆహ్వానం!

**నాగార్జునసాగర్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మహా వరుణ యాగం' నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. కృష్ణా, గోదావరి నదులు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ యాగం నిర్వహించింది. ఈ క్రతువులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని, వరుణ దేవుడికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

**108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పర్యవేక్షణలో 108 మంది వేద పండితులు, 11 హోమగుండాలతో ఈ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ఇవాళ తెల్లవారుజామున నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు ఆదిపూజతో యాగ క్రతవును ప్రారంభించారు. ఏకధాటిగా సాగిన వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణాహుతితో యాగం ముగియనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**క్లౌడ్ సీడింగ్‌తో సమానంగా 'కరీరీ ఇష్టి' మంత్రాలు!**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న తొలి మహావరుణ యాగం ఇదే కావడం గమనార్హం. ఋుగ్వేద కాలం నుంచి వరుణ దేవుడి ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉంది. కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు రాజులు వరుణ యాగాలు చేసేవారు. ఈ యాగంలో పఠించే వర్ష పాశుపత మంత్రాలు, ముఖ్యంగా 'కరీరీ ఇష్టి' వంటి వైదిక సూక్తాల ఉచ్చారణ ద్వారా వాతావరణంలో సానుకూల మార్పులు వస్తాయని విశ్వసిస్తారు. ఆధునిక కాలంలో కృత్రిమ వర్షాల కోసం చేసే 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియకు, మన వేదాల్లోని ఈ 'కరీరీ ఇష్టి' విధానానికి దగ్గరి పోలికలు ఉన్నాయని పరిశోధకులు చెబుతుండటం విశేషం.

# ఆది పూజలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ దంపతులు..

**నాగార్జున సాగర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్‌లోని విజయవిహార్‌లో నిర్వహిస్తున్న వరుణ యాగం ప్రారంభమైంది. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు ఆది పూజ నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. మంచి వర్షాలు కురిసి జలాశయాలు, చెరువులు నిండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రభుత్వం కృష్ణానది ఒడ్డిన ఈ యాగం నిర్వహిస్తోంది. ఈ వరుణ యాగానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వం వహిస్తుండగా 11 హోమగుండాలతో 108 మంది రుత్వికులతో ఈ వరుణ యాగం నిర్వహిస్తున్నారు.

# కేంద్రమంత్రికి కేటీఆర్ లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని రాయదుర్గంలో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ నిర్మాణ టెండర్లలో భారీ ఆర్థిక అక్రమాలు జరిగాయని, తక్షణమే ఈ టెండర్‌ను రద్దు చేసి స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామనకు ఆయన లేఖ రాశారు. కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని వ్యయ శాఖ ద్వారా దాదాపు రూ.202 కోట్ల ఆర్థిక సాయం పొందుతున్న ఈ ప్రాజెక్ట్, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందని, ప్రైవేట్ డెవలపర్లకు భారీగా లబ్ధి చేకూర్చేలా నిబంధనలను రూపొందించిందని కేటీఆర్ లేఖలో ఆరోపించారు.

**లేఖలోని ముఖ్యాంశాలు..**

రాయదుర్గంలోని అత్యంత ఖరీదైన 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిలో (భూమి విలువ మినహాయించి) సుమారు రూ.2,059.81 కోట్ల వ్యయంతో, 27 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో ఈ ప్రాజెక్ట్ తలపెట్టారు. ఈ ప్రాజెక్ట్ ప్రభుత్వ వాటా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేట్ డెవలపర్‌కు ఏకంగా 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కట్టబెట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. అంటే విలువైన ప్రభుత్వ భూమి, ప్రజాధనాన్ని కేటాయిస్తూనే.. ప్రభుత్వానికి కేటాయించిన స్థలం కంటే రెండింతల స్థలాన్ని బిల్డరు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ నేతృత్వంలో, అపర్ణ ఇన్‌ఫ్రాహౌసింగ్‌తో కూడిన కన్సార్టియం ఈ టెండర్‌ను దక్కించుకుందని తెలిపారు. స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్' స్కిమ్ కింద కేంద్రం ఇచ్చే రూ.200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని 'తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్' ద్వారా బ్యాక్ టు బ్యాక్ విధానంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ బిల్డరక్కు మళ్లించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పీఎం ఏక్తా మాల్ పేరును ఒక కవచంగా వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత లేని ఒప్పందాలు చేసుకుంటోందని దుయ్యబట్టారు. తక్షణమే ఈ టెండర్ను రద్దు చేయాలని, తదుపరి కేంద్ర నిధుల విడుదలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భూమి విలువ, ఆర్థిక నమూనా, టెండర్ నిబంధనలు, లబ్ధిదారుల వివరాలపై సీఏజీ లేదా ఇతర స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు. ప్రజా ఆస్తులు ప్రజల సొత్తని, వాటిని ప్రైవేట్ వ్యక్తుల ధనార్జనకు వాడుకోవడాన్ని బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని కేటీఆర్ లేఖలో స్పష్టం చేశారు.

# తెలంగాణలో జనసేన పోటీ చేయాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రానున్న మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించాలని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే రాజా సింగ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీజేపీ - జనసేన పొత్తుపై భిన్నమైన చర్చలు జరుగుతున్న తరుణంలో రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2014 నుంచి బీజేపీలోని కొందరు నాయకులు అనుసరిస్తున్న "కాంప్రమైజ్ రాజకీయాల" వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోయిందని, క్యాడర్‌ను పట్టించుకోకుండా సీనియర్లను పక్కన పెట్టడం వల్ల ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు సరైన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ వీడియోను రాజా సింగ్ విడుదల చేశారు. అందులో.. నేటి యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న క్రేజ్, అభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన తెలంగాణ రాజకీయాలపై శ్రద్ధ చూపాలని కోరారు. తెలంగాణ ప్రజలు గతంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలన, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనను చూశారని, ఈ రెండు ప్రభుత్వాల హయాంలోనూ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి అభివృద్ధి శూన్యంగా మారిందని రాజా సింగ్ విమర్శించారు. రైతులు, సామాన్య ప్రజలు ఈ పాలనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో తెలియక ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థులను పోటీకి దింపితే, వచ్చే ఎన్నికల నాటికి జనసేన నేత కూడా తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజా సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్‌కు ఇది ఒక విజ్ఞప్తి, వ్యక్తిగత అభిప్రాయంగా సమర్పిస్తున్నట్లు ఎమ్మెల్యే రాజా సింగ్ తన వీడియో లో స్పష్టం చేశారు.

## సంపాదకీయం




# పొంచివున్న నైపుణ్యాల సంక్షోభం

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల పట్ల ప్రతిఘటనోద్యమంగా పరిణమించింది. డిగ్రీలున్నా ఉద్యోగాలు రాకపోవటం, ఆకాంక్షలు పెరుగుతున్నా తగినంతగా అవకాశాలు లేకపోవటం యువతను తిరగబడేలా చేసింది. ప్రవేశ పరీక్షాపత్రం లీకవటం యువతను సమీకరించే ఒక నిప్పురవ్వ మాత్రమే. దాని వెనక దాగివున్న సంక్షోభం నిజమైనది, సంక్లిష్టమైనది.పాఠశాలల్లో కావచ్చు, కాలేజీల్లో కావచ్చు.. మన విద్యావ్యవస్థ చాలామేర కుప్పకూలింది. పిల్లల్లో 80శాతం మంది స్కూలు విద్యలో పాసవుతున్నారు కానీ, వారికి చదువులో ఎటువంటి నిజమైన పునాదీ ఉండటం లేదు. ఇందులో వారి తప్పు కూడా ఏమీ లేదు. బట్టీపట్టటం ద్వారా నేర్చుకోవటం, మూకుమ్మడి కాపీయింగ్‌లతో పాసవటం అనే అవ్యవస్థ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది.రెండోది, విద్యార్థులు ఏం నేర్చుకున్నారో బేరీజు వేసే పరీక్షా పద్ధతులు అర్థరహితంగా ఉండటంతో.. అత్యధిక శాతం ఆరాటపడే 'స్టెమ్' (సైన్స్--టెక్నాలజీ--ఇంజినీరింగ్--మ్యాథ్స్) కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా పోటీ ప్రవేశ పరీక్షలు అవసరమయ్యాయి. మూడోది, చాలా సందర్భాల్లో రాష్ట్రాలు నిర్వహించే పరీక్షా పద్ధతుల్లో విశ్వసనీయత లోపిస్తోంది. బోర్డు ప్రమాణాల్లో రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంటోంది. దీంతో, ప్రామాణిక, నిష్పాక్షిక, న్యాయమైన బేరీజు కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష అవసరమవుతోంది.నాలుగోది, వైద్య కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగినప్పటికీ, ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు మాత్రమే యువ మెడికోలకు కనీస ప్రమాణాల శిక్షణను అందించగలుగుతున్నాయి. కాబట్టి, లక్షలాది మందికి వైద్య కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా, మెరుగైన కొన్ని కళాశాలలకే డిమాండ్ ఉంది. వాటిల్లో చేరేందుకు ఉత్తమ ర్యాంకుల కోసం విపరీత పోటీ ఉంటోంది.అయిదోది, మెడికల్ పోటీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే డిమాండ్‌కు అనుగుణంగా అనేక కోచింగ్ సెంటర్లు వెలిశాయి. పదవ తరగతి తర్వాత శిక్షణ--చదువును విభాగాలవారీ ప్యాకేజీలతో అందించనారంభించాయి. పోటీ, పాఠశాల పునాదులు బలహీనంగా ఉండటం వల్ల.. ఆ రెండేళ్లపాటు యువ విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.ఇంత మితిమీరిన ఒత్తిడి వాతావరణంలో, పరీక్షా పత్రం లీక్ అయిందంటే-- అది యువతకు, వారి తల్లిదండ్రులకు శరాఘాతమే. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంతటి అలజడికి దారితీయటంలో ఆశ్చర్యమేమీ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల బాధను గ్రహించి కేంద్ర ప్రభుత్వం సహానుభూతితో సకాలంలో బలంగా స్పందించి ఉండాల్సింది. రాజకీయంగా సున్నితంగా వారితో కూర్చుని మాట్లాడాల్సింది. అలాగాక, సవాలక్ష సమస్యల్లో ఇదొకటి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. భారీఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చే ఓ ఉద్యమానికి నిప్పురవ్వ రాజుకుంటోందని అంచనా వేయలేకపోయింది.అధికారాన్వేషణలో మునిగితేలే మనలాంటి సమాజంలో ఇలాంటి తక్షణ రాజకీయ పర్యవసానాలు రసవత్తరంగా అనిపిస్తాయిగానీ, మనం ఆ నిప్పురవ్వను దాటి ఆలోచించాలి. ఏమాత్రం ఆజ్యం తగిలినా ఓ పెద్ద విస్ఫోటనానికి దారితీసే మూలాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మన 'విద్య--నైపుణ్యాలు-- ఉపాధి అవకాశాల' అభివృద్ధి వలయాన్ని దెబ్బతీసే ఒక లోతైన సంక్షోభం అందులో దాగివుంది.ప్రస్తుతం మన దేశంలో ప్రతిష్ఠాత్మక కోర్సుల్లో చేరుతున్నవారికి కూడా నైపుణ్యాలు ఉండటం లేదు. ఉద్యోగాల్లోకి తీసుకోవటానికి చాలామందికి తగిన నైపుణ్యాలు లేవు. 13.5 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 15--20శాతం మందికే ఉద్యోగాలకు తగిన కనీస నైపుణ్యాలున్నాయని అంచనా.ఏళ్ల తరబడి కాలేజీల్లో చదువుకున్నాక, ఒక విలువ లేని డిగ్రీతో యువత బయటకు వస్తున్నారు. వైద్య గ్రాడ్యుయేట్లకు కూడా శిక్షణ అరకొరగా ఉంటోంది. పట్టభద్రుల సంఖ్యతో పొంతన లేకుండా వైద్య పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు అతితక్కువ సంఖ్యలో ఉండటంతో, అందులో చేరగలగటం భగీరథ ప్రయత్నంలా మారుతోంది. ఎలాగోలా మరో ప్రవేశపరీక్షలో నెగ్గి, పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణ తీసుకున్న తర్వాత కూడా, వైద్య వృత్తి ప్రాక్టీస్‌కి తగిన నైపుణ్యాలు, నమ్మకం కోసం పేరొందిన వైద్య నిపుణుల వద్ద కొన్నేళ్లపాటు సహాయకులుగా పనిచేయాల్సి వస్తుంది. ఎంతో విలువైనవిగా భావించే 'స్టెమ్' కోర్సుల పరిస్థితే ఇంత ఇబ్బందికరంగా ఉంటే, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఏటా చేరే సుమారు 90లక్షల మంది విద్యార్థుల పరిస్థితేమిటో ఊహించుకోవచ్చు.ఉద్యోగ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారిపోతోంది. యూనివర్సిటీ డిగ్రీలు అంతేవేగంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ఈ చదువులోనూ అత్తెసరు ప్రమాణాలుంటే.. ఇక ఆ దుస్థితికి అంతుండదు. కాబట్టి, నైపుణ్యాల అంతరం అనేది మనం తక్షణం దృష్టి సారించాల్సిన అంశం.ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థకయినా అత్యున్నత నైపుణ్యాలున్న టెక్నోక్రాట్లు పరిమిత సంఖ్యలోను, నైపుణ్యాలున్న శ్రామిక ఉద్యోగులు పెద్దసంఖ్యలోను అవసరం. కానీ భారత్‌లో ఆ పిరమిడ్ తలకిందులుగా ఉంది. భారత్‌లో కేవలం 50శాతం ఐ.టి.ఐ సీట్లు భర్తీ అవుతున్నాయి. కొద్దిమంది యువత మాత్రమే ఐ.టి.ఐల్లో చేరుతున్నారు (సుమారు 13.20 లక్షలు). పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ఇంకా తక్కువమంది (సుమారు 6.4 లక్షలు) విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారితో (13.54 లక్షలు) పోలిస్తే, వారి సంఖ్య అలా తక్కువగా ఉండటం ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ కనిపించని సరళి. ఈ కోర్సులన్నిటిలోనూ ఎక్కువమంది విద్యార్థులు నిజమైన నైపుణ్యాలు, ఉత్పాదకత లేకుండా కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీలు అందుకుంటారు.చైనా ప్రతి సంవత్సరం 16.62 లక్షల మంది ఇంజినీర్లకు అద్భుతమైన శిక్షణనిస్తుంది. వారంతా నిజమైన టెక్నోక్రాట్లు, నైపుణ్యాలున్న ఇంజినీర్లు. అదేవిధంగా, ఆ దేశం వృత్తి విద్యలో 56.40 లక్షల యువతకు నిజమైన నైపుణ్యాల్ని అందిస్తుంది. చైనాలో పాఠశాల విద్య పునాదులు కూడా చాలా ప్రామాణికంగా ఉన్నాయి.మనం స్కూళ్లు, కళాశాలలను దాదాపు అందరికీ అందుబాటులోకి విస్తరించాం. కానీ కొన్ని ఖరీదైన విద్యాసంస్థల్లో తప్ప, చాలా సందర్భాల్లో చదువుల నాణ్యత అధ్వానంగా ఉంటోంది. ఈ మొత్తంలో బాధితులు-- మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు, తల్లిదండ్రులు. సంపదసృష్టిలో 'జెన్ జీ'కి నిజమైన అవకాశం లభించాలంటే, మన విద్యను, నైపుణ్యాల అభివృద్ధిని సమూలంగా మార్చుకోవాలి.ఆపైన సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను సృష్టించటానికి మనం చేయాల్సింది చాలా ఉంది. అది వేరే చర్చ. నిశితంగా పరిశీలించే ప్రతి ఒక్కరికీ విద్యారంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం గురించి తెలుసు. యువ జనాభాపరంగా మనకున్న అద్భుతావకాశాల్ని మనం వృథా చేసుకుంటున్నాం. ఆ అవకాశం ఎల్లకాలం కొనసాగదు. త్వరలో ముగుస్తుంది. త్వరపడి, దృఢ సంకల్పంతో వ్యవహరిస్తేనే అవకాశాన్ని మనం సద్వినియోగం గావించుకోగలం.రాజకీయంగా ఒక స్థూల ఏకాభిప్రాయానికి రావాల్సిన అంశమిది. ఎందుకంటే, ప్రతి పార్టీకీ ఇందులో గరిష్ఠ వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనం దాగివుంది. విద్యను నియంత్రించేది రాష్ట్రాలు కాబట్టి, ఎక్కువ కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుంది.రాజకీయాలు, పరిపాలన, పౌర సమాజం, మీడియా, విద్యారంగంలోని మనమంతా సంఘటితమై నిర్మాణాత్మక, సృజనాత్మక పరిష్కారంతో ఈ సంక్షోభంపై స్పందించాల్సి ఉంది. ఆయాసం తప్ప ఫలితంలేని పడికట్టు పదాలకు, చేసిన తప్పుల్నే మళ్లీ మళ్లీ చేసే యథాతథ పాలనా ధోరణికి ఇక కాలం చెల్లింది. మనం ఈ సవాలుకు దీటుగా, యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ సంక్షోభం మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్ని, సమాజాన్ని కమ్మేస్తుంది. మన భవిష్యత్తును కుంగదీస్తుంది.

# మనం నాటిన విత్తనం..మనకే విషంగా !

మనం నాటిన విత్తనం.. మనకే విషంగా మారుతోంది. మనం ఏర్పాటు చేసిన దేశం.. మనకే శత్రువుగా మారుతోంది. ఇప్పటికే దాయాది పాకిస్తాన్‌తో తలబొప్పి కడుతున్న భారత్‌కు.. బంగ్లాదేశ్ కూడా మరో పాకిస్తాన్‌లో తయారౌతోందనే ఆందోళన కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రాజకీయ ఆశ్రయం పేరుతో ఢిల్లీ వచ్చిన బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా.. భారత్ గడ్డపై నుంచి పెట్టిన పొలిటికల్ ప్రెస్‌మీట్ ఎన్నో ప్రశ్నల్ని లేవనెత్తుతోంది. షేక్ హసీనా.. రెండేళ్లుగా భారత్‌లో ఉంటున్నారు. ఓవైపు ఈమెను అప్పగించాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తున్న తరుణంలో.. హసీనా మనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టారు. ఢిల్లీలో బంగ్లాదేశ్ రాజకీయాల గురించి ప్రెస్ మీట్ పెట్టడాన్ని.. బంగ్లాదేశ్ తీవ్రంగా తీసుకుంటోంది. దీంతో తమకు సంబంధం లేదని కేంద్రం చెబుతున్నా.. బంగ్లాదేశ్‌కు మాత్రం చాలా అనుమానాలున్నాయి. మరోవైపు ప్రస్తుతం హసీనాకు రాజకీయ ఆశ్రయాన్ని గతంలో ఇందిర చేసిన మానవతా సాయంతో పోల్చిచూడలేమనే చర్చ కూడా జరుగుతోంది.బంగ్లాదేశ్ మొన్నటిదాకా మన మిత్రదేశమే. అంతేకాదు మనపై చాలా కృతజ్ఞత ఉన్న దేశం కూడా. కానీ ఏ ముహూర్తాన బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం మొదలైందో.. అప్పట్నుంచీ ఆ దేశంలో అంతా మారిపోయింది. నివురుగప్పిన నిప్పులా ఉన్న భారత్ వ్యతిరేకత క్రమంగా కార్చిచ్చులా మారి.. విద్యార్థి ఉద్యమం ముసుగేసుకుని.. భారత్ అనుకూల నేతగా ఉన్న షేక్ హసీనాని దేశం నుంచి వెళ్లగొట్టింది. అంతటితో ఆగకుండా ఆమె పార్టీ అవామీలీగ్‌ను లేకుండా చేయాలనే దురాలోచనతో.. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు, జైలుశిక్షలతో అరాచకం ప్రబలింది. హసీనా తమకు దొరకలేదన్న కోపాన్ని ఈ నిరసనకారులు.. బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులపైకి మళ్లించారు. హిందూ యువకుల్ని వెంటాడి, వేటాడి చంపారు. చివరకు హిందూ పూజారులు, సన్యాసుల్నీ వదల్లేదు. అంతర్జాతీయంగా పేరున్న ఇస్కాన్ సభ్యుల్ని కూడా వదలకుండా దాడులకు తెగబడటం.. హత్యలు చేయడం పరాకాష్టగా నిలిచింది.తమ దేశంలో పరిస్థితి అదుపు తప్పడంతో.. ప్రాణభయంతో భారత్‌కు పారిపోయి వచ్చిన హసీనా.. మొదట్లో రాజకీయ ఆశ్రయం కోరారు. కానీ మన సర్కారు అధికారికంగా నిరాకరించింది. కానీ అనధికారికంగా సహకరించారని, అందుకే రెండేళ్లుగా ఆమె ఇక్కడే ఉంటున్నారనేది బంగ్లాదేశ్ ఆరోపణ. అంతకు మించి తమ దేశంలో దోషిగా ఉన్న హసీనాను.. భారత్ కాపాడటమేంటని బంగ్లాదేశ్ ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ కోపంతోనే వారు.. భారత్ తమకు చేసిన సాయాన్ని మర్చిపోయి.. శత్రుత్వం పెంచుకుంట్నున్నారు. ఈ పరిణామంతో బంగ్లాదేశ్‌లో కొన్ని భారత్ వ్యతిరేక ఛాందస శక్తులకు.. సాధారణ ప్రజల రూపంలో మరింత బలం చేకూరింది. ఆ ఆగ్రహంతోనే బంగ్లాదేశ్‌లో హిందువుల వేట మొదలైంది. చివరకు భారత్ జోక్యం చేసుకుని అనుచిత దాడులు ఆపాలని చెప్పినా.. అక్కడ పరిస్థితి పూర్తిగా సద్దుమణగలేదు. ఈలోగా బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిగాయి. కాకపోతే హసీనా పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు. దీనికి తోడు హసీనా ప్రత్యర్థి ఖలీదా జియా కన్నుమూశారు. దీంతో ఖలీదా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించారు. ప్రధాని అయ్యాక ఇండియా వచ్చిన తారిఖ్ రెహ్మాన్ మన నేతల్ని కలిసి.. భారత్‌తో సత్సంబంధాలకే ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కానీ ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు పూర్తిస్థాయిలో సడలిపోలేదు. ఓవైపు దౌత్యపరంగా సున్నిత పరిస్థితి నెలకొనగా.. మరోవైపు హసీనా ఉన్నట్టుండి.. ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి.. త్వరలో బంగ్లాదేశ్ వెళ్తానని ప్రకటించడం.. బంగ్లాదేశ్ అహాన్ని మరింత దెబ్బతీయొచ్చనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే మనం హసీనా రక్షణ కోసం దౌత్యమార్గంతో పాటు అన్ని మార్గాలనూ విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాం. పరిస్థితులు సద్దుమణిగాక.. హసీనాను సైలెంట్‌గా స్వదేశం పంపిస్తారనే ఊహాగానాలూ వచ్చాయి. కానీ వీటన్నింటికీ చెక్ పెడుతూ.. హసీనా భారత్ గడ్డపై బంగ్లాదేశ్ రాజకీయాల గురించి ప్రెస్‌మీట్ పెట్టడం.. శృతి మించిన చర్యే అంటున్నారు. తన కోసం ఇంత రిస్క్ తీసుకుంటున్న భారత్ పరిస్థితి గురించి ఏ మాత్రం ఆలోచించకుండా.. హసీనా చేసిన ఈ పని.. ఆమెపై మన దేశంలోనూ ఆగ్రహం కలిగేలా చేస్తోంది. ఎందుకంటే హసీనా భారత్‌కు అనుకూల నేతే అయినా.. ఆమె ఒక్కరి కోసం బంగ్లాదేశ్‌లో హిందువులందర్నీ రిస్క్‌లో పెట్టడం కుదరదు. ఇప్పటికే ద్వైపాక్షిక సంబంధాల గురించి హసీనాకు పూర్తి అవగాహన ఉంది. అయినా సరే ఇలా ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా ఆమె పరిస్థితుల్ని మరింత సంక్లిష్టం చేశారనడంలో సందేహం లేదు.బంగ్లాదేశ్ ప్రస్తుత రాజకీయం అర్థం కావాలంటే.. మనం ఓసారి ఆ దేశ ఆవిర్భావం దగ్గర్నుంచీ చరిత్ర చూడాలి. బంగ్లాదేశ్ పేరుకి దేశంగా ఏర్పడ్డ.. అక్కడ ప్రజలు మాత్రం మొదట్నుంచీ పాక్ అనుకూల, వ్యతిరేక శిబిరాలుగానే మోహరించారు. హసీనా తండ్రి బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ ఆధ్వర్యంలో సాగిన బంగ్లా విముక్తి పోరాటంలోనూ దేశ ప్రజలంతా పాల్గొనలేదనే చర్చ ఉండనే ఉంది. ఇలా తొలినాళ్లలనే రెండు ధృవాలుగా ఏర్పడ్డ బంగ్లాదేశ్‌లో రాజకీయ పార్టీలు కూడా అలాగే ఉన్నాయి. హసీనా నేతృత్వంలో అవామీలీగ్ భారత్ అనుకూల దృక్పథంతో ఉంటే.. ఖలీదా నేతృత్వంలోని బంగ్లా నేషనలిస్ట్ పార్టీ పాక్ అనుకూల దృక్పథంతో ఉండేది. దశాబ్దాలు గడిచినా వీటి వైఖరిలో ఏ మార్పూ లేదు. అందుకు తగ్గట్టుగానే ఖలీదా పాలన వచ్చిన ప్రతిసారీ బంగ్లాలో భారత్ వ్యతిరేక శక్తులు రెచ్చిపోతుండేవి. అందుకు భిన్నంగా హసీనా అధికారంలోకి రాగానే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడేవి. ఇంతవరకూ అంతా బాగానే ఉంది. కానీ ఇప్పుడు హసీనా భారత్‌లో ఉండటం.. అంతకు మించి పొలిటికల్ ప్రెస్‌మీట్ పెట్టడం పూర్తిగా ప్రత్యేక పరిస్థితి.ఆమాటకొస్తే హసీనా భారత్ రావడం ఇదే తొలిసారి. తన జీవితంలో భయంకరమైన ఆపద వచ్చినప్పుడు.. తండ్రి కళ్ల ముందే చనిపోయినప్పుడు.. సరిగ్గా చెప్పాలంటే కొన్ని దశాబ్దాల ముందు కూడా ఓ చిన్నారిగా ఇండియా గడ్డపై అడుగుపెట్టారు హసీనా. అలా ప్రాణభయంతో వచ్చిన హసీనా.. అప్పటి మన ప్రధాని ఇందిరాగాంధీ అక్కున చేర్చుకున్నారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తామని ప్రకటించి.. హసీనా ఓ నేతగా ఎదగటానికి దోహదపడ్డారు. కానీ అప్పట్లో ఎవరూ ఆ చర్యను తప్పుబట్టలేదు. ఎందుకంటే అది కష్ట సమయంలో భారత్ పెద్ద మనసుకు నిదర్శనంగా నిలిచింది. అయితే ఇప్పటి పరిస్థితి అలాంటిది కాదు. ఇప్పుడు హసీనా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని. బంగ్లాదేశ్ చట్టాలు, కోర్టుల ప్రకారం అక్కడి విద్యార్థి ఉద్యమాన్ని నిరంకుశంగా అణగదొక్కాలని చూసిన దోషి. ఇప్పటికే బంగ్లాదేశ్ కోర్టులు ఆమెకు శిక్షలు విధించాయి. ఇప్పటికైనా హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ కొత్త సర్కారు కూడా భారత్‌ను కోరుతూ వస్తోంది. అయితే బంగ్లా ఇలా అడిగిన ప్రతిసారీ.. దౌత్యపరమైన మార్గాల ద్వారా ఒడుపుగా సమాధానం చెబుతూ వచ్చిన భారత్‌ను.. హసీనా పొలిటికల్ ప్రెస్‌మీట్ ఓ క్షణం డిఫెన్స్‌లో పడేసిందనే చెప్పాలి. చివరకు తేరుకుని ఆ ప్రెస్‌మీట్‌తో తమకు సంబంధం లేదని ఖండన ఇచ్చింది. కానీ బంగ్లాదేశ్ మనసులో ఉన్న అనుమానం పెనుభూతమైంది. భారత్ అండ లేకుండా హసీనా ఇంతకు తెగించబోరని బంగ్లా ప్రస్తుత సర్కారు అనుకుంటోంది. జరిగిన పరిణామాల్ని బట్టి వారలా అనుకోవటాన్ని పూర్తిగా తప్పుబట్టలేమని కూడా మన దౌత్యవర్గాలు చెబుతున్నాయి.సరే జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు ఇదే అదనుగా బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్ చేయటానికి అక్కడి ఛాందస శక్తులు కాచుక్కూర్చున్నాయి. మనకు వ్యక్తుల కంటే బంగ్లాదేశ్‌తో సంబంధాలే ముఖ్యమని గట్టిగా చాటాల్సిన సందర్భమిది. ఎవరైనా ద్వైపాక్షిక సంబంధాల కంటే ఎక్కువ కాదనే మెసేజ్ దౌత్యమార్గంలో బంగ్లాకు పంపాల్సిందే. అప్పుడు ఆ దేశాన్ని పాక్ విషకౌగిలి నుంచి బయటకు లాగటానికి వీలవుతుంది. లేకపోతే మన కళ్ల ముందే.. మనం పెంచిన దేశం.. మనకే శత్రువుగా మారి.. పాకిస్తాన్ మాదిరిగా కొత్త తలనొప్పిగా మారుతోందనే హెచ్చరికలు వస్తున్నాయి.

# పదవుల పందేరం..

తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల భర్తీ ప్రక్రియ క్రమంగా వేగం పుంజుకుంటోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్టీ పదవులు, అనుబంధ విభాగాల నియామకాలు, నామినేటెడ్ పోస్టుల భర్తీపై అధిష్ఠానం దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే పలు అనుబంధ సంఘాలకు చైర్మన్లను నియమించడం ద్వారా పార్టీ నాయకత్వం ఆశావహులకు ఒక్కొక్కటిగా తలుపులు తెరుస్తోంది. అయితే అసలు ఆసక్తి మాత్రం కీలకమైన టీపీసీసీ కార్యవర్గం, కార్పొరేషన్ల పదవులు, ఎమ్మెల్సీ స్థానాలపై నెలకొంది.ఇప్పటికే ఓబీసీ విభాగం చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎస్సీ విభాగం చైర్మన్‌గా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా యడవెల్లి వెంకటస్వామి నియమితులయ్యారు. పార్టీ మీడియా, సోషల్ మీడియా విభాగాల్లోనూ కీలక నియామకాలు జరిగాయి. మీడియా, పబ్లిసిటీ సెల్ చైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సోషల్ మీడియా విభాగం చైర్మన్‌గా నవీన్ పెట్టంలకు బాధ్యతలు అప్పగించారు.ఈ నియామకాలు కేవలం ఖాళీల భర్తీగా చూడలేం. పార్టీని నమ్ముకుని కొనసాగుతున్న నేతలను సంతృప్తిపరచడం, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, వచ్చే రాజకీయ పోరాటాలకు సంస్థాగతంగా పార్టీని సిద్ధం చేయడం వంటి అనేక రాజకీయ లెక్కలు ఇందులో కనిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల కోసం కాంగ్రెస్‌లో పోటీ పెరగడం సహజమే. అయితే ఎక్కువ మందికి పదవులు ఇవ్వడం సాధ్యం కాకపోవడంతో, అందుబాటులో ఉన్న ప్రతి సంస్థ, విభాగం, కమిటీని రాజకీయ సమతుల్యతకు ఉపయోగించాల్సిన పరిస్థితి నాయకత్వంపై ఉంది.

**అసలు పోటీ అక్కడే.. టీపీసీసీ కార్యవర్గంపై ఉత్కంఠ**

అనుబంధ విభాగాల నియామకాలు పూర్తవుతున్నప్పటికీ టీపీసీసీ కార్యవర్గం మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు వంటి కీలక పదవులు ఇందులో ఉండటంతో సీనియర్ నేతల మధ్య పోటీ మరింత తీవ్రవవుతోంది.కాంగ్రెస్‌లో పదవి అనేది కేవలం గౌరవం కాదు.. భవిష్యత్ రాజకీయ ప్రాధాన్యతకు కూడా ఒక సంకేతం. అందుకే టీపీసీసీ కార్యవర్గంలో చోటు దక్కించుకోవాలని పలువురు సీనియర్ నేతలు తమ రాజకీయ పరిచయాలు, వర్గ బలాన్ని ఉపయోగించుకుంటున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో ఉంది. ఒకరికి పదవి ఇస్తే మరొక వర్గం అసంతృప్తి చెందకుండా సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అధిష్ఠానంపై ఉంది.

**37 కార్పొరేషన్లు.. మరోసారి ఆశావహుల పరుగులు**

ఇటీవల 37 కార్పొరేషన్ల చైర్మన్ల పదవుల కాలపరిమితి ముగియడంతో మరోసారి ఆశావహుల్లో కదలిక మొదలైంది. పార్టీ కోసం పనిచేసిన నేతలు తమకు అవకాశం ఇవ్వాలని ముఖ్య నేతలను కలుస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు రాని నేతలు, ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ఇప్పుడు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు.ఇది కాంగ్రెస్ నాయకత్వానికి ఒకవైపు అవకాశం.. మరోవైపు సవాలు. పదవులు ఇవ్వడం ద్వారా అసంతృప్తిని తగ్గించవచ్చు. కానీ పదవులు పరిమితంగా ఉండటంతో ప్రతి ఒక్కరినీ సంతృప్తిపరచడం సాధ్యం కాదు. దీంతో ఒక నియామకం మరో వర్గంలో అసంతృప్తికి కారణం కాకుండా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

**ఎమ్మెల్సీ స్థానాలపై మరింత వేడి**

పార్టీ పదవులతో పాటు ఎమ్మెల్సీ స్థానాలపైనా కాంగ్రెస్‌లో పోటీ పెరుగుతోంది. నవంబర్‌లో ఖాళీ కానున్న గవర్నర్ కోటా మూడు ఎమ్మెల్సీ స్థానాలు, వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై ఇప్పటికే అనేక మంది నేతలు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.ఈ స్థానాలు సాధారణ రాజకీయ పదవులు కావు. శాసన మండలిలో ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు భవిష్యత్ మంత్రివర్గ విస్తరణలు, పార్టీ వ్యూహాలు, ప్రాంతీయ సమీకరణాల్లో కూడా ఇవి కీలకంగా మారే అవకాశం ఉంది. అందుకే ఎమ్మెల్సీ పదవుల కోసం పోటీ కూడా పార్టీ అంతర్గత రాజకీయాల్లో మరో శక్తికేంద్రంగా మారుతోంది.

**పదవుల భర్తీ.. పార్టీకి బలమా? అసంతృప్తికి కారణమా?**


కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉన్న ప్రధాన సవాలు పదవులను భర్తీ చేయడం మాత్రమే కాదు.. వాటి ద్వారా పార్టీని మరింత సమర్థవంతంగా నడిపించడం. అధికారంలో ఉన్న పార్టీగా సహజంగానే పదవుల కోసం డిమాండ్ పెరుగుతుంది. అయితే పదవులు దక్కని నేతలు అసంతృప్తికి గురైతే అది పార్టీ అంతర్గత సమీకరణాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.అందుకే నాయకత్వం ప్రస్తుతం ఒకేసారి రెండు లక్ష్యాలను సాధించాల్సి ఉంది. ఒకవైపు పార్టీ కోసం పనిచేసిన నేతలకు గుర్తింపు ఇవ్వాలి. మరోవైపు సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమతుల్యం చేయాలి. అదే సమయంలో ప్రభుత్వ పనితీరుకు రాజకీయంగా అండగా నిలిచే బలమైన సంస్థాగత వ్యవస్థను నిర్మించాలి.ప్రస్తుతం జరుగుతున్న నియామకాలను చూస్తే కాంగ్రెస్ నాయకత్వం ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ అసలు పరీక్ష టీపీసీసీ కార్యవర్గం, కీలక నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ స్థానాల భర్తీ సమయంలోనే ఎదురుకానుంది. అక్కడ తీసుకునే నిర్ణయాలు పార్టీ అంతర్గత సమీకరణాలను మాత్రమే కాదు.. రాబోయే రాజకీయ వ్యూహాన్ని కూడా ప్రభావితం చేసే అవకాశముంది.అందుకే కాంగ్రెస్‌లో ఇప్పుడు ప్రశ్న ఒక్కటే కాదు "ఎవరికి పదవి?" అనే దానికంటే "ఎవరికి ఏ పదవి ఇస్తే పార్టీకి రాజకీయంగా ఎంత లాభం?" అనేదే అసలు లెక్కగా మారింది.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇష్టారాజ్యం!?

**భీమదేవరపల్లి,ఫ్లాష్ ఇండియా :** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో వివాదానికి దారితీస్తోంది. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని, అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని గ్రామ-స్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాపాలన సభలో వెయ్యి మందికి పైగా పేర్లు వెల్లడైనప్పటికీ.. చివరకు 72 మందికే ఇళ్లు మంజూర-య్యాయని చెబుతున్నారు. ఈ 72 మంది జాబితాలో ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్న కొందరికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్న ఆరోపణలు మరింత చర్చకు దారితీశాయి. ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి సొంత గూడు కల్పించడమే పథకం ఉద్దేశమైనప్పటికీ.. ముల్కనూరులో అద్దె ఇళ్లలో నివసిస్తున్న, సొంత ఇల్లు లేని పలువురు పేదలకు అవకాశం దక్కలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మరోవైపు ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి మంజూరు జరిగిందన్న ఆరోపణలు రావడంతో అర్హతలను ఏ ప్రాతిపదికన నిర్ధారించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారా? అర్హతల నిర్ధారణ ఎలా జరిగింది? తుది జాబితాను ఎవరు ఖరారు చేశారు? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. బీసీ కాలనీలో ఓ వైద్యుడి కుటుంబానికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశంపై అధికారిక నిర్ధారణ, సంబంధిత అధికారుల వివరణ రావాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపికలో గ్రామస్థాయి కమిటీల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కమిటీలు ఏ ప్రాతిపదికన ఏర్పడ్డాయి? వాటి సిఫార్సులను ఎలా పరిగణనలోకి తీసుకున్నారు? తుది జాబితా రూపకల్పనలో ఎవరి నిర్ణయం కీలకంగా మారింది? వంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**అర్హత లేని వారు జాబితాలో ఉన్నారా..?**

మరోవైపు మంజూరైన ఇళ్ల నిర్మాణాల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో కొన్ని నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇల్లు వస్తుందనే ఆశతో అప్పులు చేసి పనులు ప్రారంభించామని, బిల్లులు రాకపోవడంతో అప్పుల భారం పెరిగిందని చెబుతున్నారు. పాత ఇళ్లను కూల్చుకున్న కొందరు ప్రస్తుతం అద్దె ఇళ్లలో ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస-్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపుపై పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమా-ర్లు సంప్రదించినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవోకు వినతులు అందించినట్లు చెబుతున్నప్పటికీ సమస్య పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదని అంటున్నారు. అధికారులతో జరిగిన సంభాషణను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసినట్లు కొందరు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వారు చెబుతున్నారు. ముల్కనూరులో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై వస్తున్న ఆరోపణలకు తెరపడాలంటే 72 మంది లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో మ-రోసారి పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి నిజంగా మంజూరు జరిగిందా? అర్హత లేని వారు జాబితాలో ఉన్నారా? ఇల్లు లేని నిరుపేదలు ఎందుకు పక్కన పెట్టారు? అన్న అంశాలను తేల్చాలని కోరుతున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి తుది జాబితా వరకు మొత్తం ప్రక్రియ పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని,అర్హతే ప్రామాణికంగా నిజమైన నిరుపేదలకు ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# మరోసారి పొడిగిస్తారా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న 'SIR' ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగింపునకు సంబంధించి ఓటర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే భారత ఎన్నికల సంఘం రెండుసార్లు గడువును పొడిగించిన నేపథ్యంలో, అది నేటితో పూర్తి కానుంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించినందున, మరోసారి గడువు పొడిగించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని సమాచారం. కాబట్టి ఇప్పటివరకు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కాని పౌరులు వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 73.95 లక్షల మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోలేదని సమాచారం. ఈ భారీ సంఖ్య కారణంగా రాబోయే తుది ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య ఊహించని రీతిలో తగ్గే ప్రమాదం ఉందని ఎన్నికల విభాగం అంచనా వేస్తోంది. ముందుగా నిశ్చయించిన షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 17న సీఈఓ కార్యాలయం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాలు, సవరణలు, కొత్త దరఖాస్తులను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తిస్థాయి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. నేటితో గడువు ముగుస్తుండటంతో మ-రోసారి సమయం ఇస్తారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

# కార్మికుల వేతనాల్లో దోపిడీ..!?



**కొండమల్లేపల్లి,ఫ్లాష్ ఇండియా :** కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల హక్కులు, ఆరోగ్యం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. 8వేల జనాభా ఉన్న పంచాయతీలోని 90 మంది కార్మికులకు మూడేళ్లుగా కనీస పరికరాలు అందించడం లేదు. మాస్కులు, గ్లౌజులు లేకపోవడంతో కుళ్లిపోయిన వ్యర్థాలను చేతులతో ఎత్తుతూ కార్మికులు రోగాల పాలవుతున్నారు. సబ్బులు, నూనె, బూట్లు ఇవ్వకపోగా ఇచ్చే అరకొర జీతాల్లోనూ అధికారులు కోతలు విధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీకి జనరల్ ఫండ్ రాకపోవడం, బడ్జెట్ కొరత వల్లే పరికరాలు ఇవ్వలేక పోయామని కార్యదర్శి వెల్లడించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు తగిన రక్షణ పరికరాలు, పూర్తి వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. నాగార్జునసాగర్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దాదాపు 8 వేలకు పైగా జనాభా ఉన్న ఈ పంచాయ-తీలో పనిచేస్తున్న 90 మంది కార్మికులకు మూడేళ్లుగా కనీస సౌకర్యాలు అందడం లేదు. నిబంధనల ప్రకారం ఏడాదికి రెండు జతల యూనిఫాం, స్నానపు సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, గ్లౌజులు, మాస్కులు అందించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మాస్కులు, గ్లౌజులు కూడా లేకుండా డ్రైనేజీలు, కుళ్లిపోయిన చెత్తను శుభ్రం చేస్తూ కార్మికులు తరచూ అనారోగ్యం పాలవుతున్నారు.

**వేతనాల్లో కోత.. అసమానతలు..**

పారిశుధ్య కార్మికులకు చెల్లించే జీతాల్లో కూడా తీవ్ర వ్యత్యాసాలు చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీనియర్లకు రూ. 9,500, మధ్యలో చేరిన వారికి రూ. 6,500, కొత్తవారికి రూ. 6వేలు మా-త్రమే చెల్లిస్తున్నారు. గ్రామపంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా కార్మికులు పనిచేస్తున్నారనే సాకుతో అధికారులు వేతనాల్లో కోత విధిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బడ్జెట్ లేని కారణంగానే సౌకర్యాలు కల్పించలేదు..**

గ్రామ పంచాయతీకి జనరల్ ఫండ్ రాలేదు. బడ్జెట్ కొరత కారణంగానే కార్మికులకు దు-స్తులు, గ్లౌజులు, మాస్కులు తదితర సౌకర్యాలు కల్పించలేకపోయాం. మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది.

# స్నాప్‌చాట్‌లో డ్రగ్స్ దందా..


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఈగల్ ఫోర్స్ , అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన పక్కా ఆపరేషన్‌లో ఓ డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ. 2.5 లక్షల విలువైన 200 మిల్లీలీటర్ల (330 గ్రాములు) హ్యాష్ ఆయిల్‌ను సీజ్ చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన బూర్సె నరేంద్ర శ్రీనివాస్ (30) ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో నివాసముంటూ జీవనోపాధి కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, చెడు వ్యసనాలకు బానిసైన అతడు గతంలోనే గంజాయి విక్రయిస్తూ సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీసు స్టేషన్లలో పలు ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గత నవంబర్‌లో బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు, డ్రైవింగ్ ద్వారా వచ్చే ఆదాయం చాలకపోవడంతో మళ్లీ డ్రగ్స్ దందా వైపు మళ్లాడు.

**స్నాప్‌చాట్ ద్వారా నెట్‌వర్క్.. కోరాపుట్ నుంచి అక్రమ రవాణా**

పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు నరేంద్ర శ్రీనివాస్ స్నాప్‌చాట్ యాప్‌ను వేదికగా చేసుకున్నాడు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పాడువాకు చెందిన 'హరి' అనే సరఫరాదారుడితో స్నాప్‌చాట్ ద్వారా పరిచయం పెంచుకుని, అక్కడ రూ. 9,000కు కొనుగోలు చేసిన హ్యాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌లో 10 మిల్లీలీటర్లను రూ. 1,200 చొప్పున విక్రయించేందుకు పథకం వేశాడు. ఈ క్రమంలోనే ఆగస్టు 2న ఒడిశా వెళ్లిన అతడు, అక్కడి నుంచి హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి ఆగస్టు 7న బస్సులో బయలుదేరాడు. అరెస్టు కాకుండా ఉండేందుకు ముందుగా టికెట్లు బుక్ చేసుకోకుండా నడుస్తున్న బస్సుల్లో ప్రయాణించే పద్ధతిని ఎంచుకున్నాడు.

**ORR వద్ద పట్టుకున్న పోలీసులు..**

విశ్వసనీయ సమాచారంతో ఆగస్టు 8న ఈగల్ ఫోర్స్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఒడిశా నుంచి వచ్చిన బస్సు దిగగానే నరేంద్ర శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రెండు బాటిళ్లలో ఉన్న హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేష-న్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, పరారీలో ఉన్న ముఖ్య సరఫరాదారు హరి కోసం గాలిస్తున్నారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఈగల్ ఫోర్స్ విజ్ఞప్తి చేసింది.




# లోపల అంధ భక్తులు ఉన్నారంటూ సెటైర్లు

## 'మోడియా బింద్' కళ్లజోడుతో పార్లమెంట్‌కు రేణుకా చౌదరి..

**న్యూ ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'మోడియా బింద్' అని రాసి ఉన్న ప్రత్యేక కళ్లజోడును ధరించి ఆమె ఇవాళ పార్లమెంట్‌కు రాగా ఆ అద్దాల గురించి మీడియా సిబ్బంది ప్రశ్నించగా అవి అంధ భక్తుల చికిత్స కోసం అని చెప్పారు. సాధారణంగా కంటి శుక్లాల (కేటరాక్ట్) చికిత్స ఆసుపత్రుల్లో జరుగుతుంది. కానీ పార్లమెంటులో ఉన్న చాలామంది అంధ భక్తులు 'మోడీయా బింద్' వ్యాధితో బాధపడుతున్నారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలు, అక్రమాలు ఏవీ వారి కంటికి కనిపించడం లేదని విమర్శించారు. రామ మందిరంలో విరాళాల దొంగతనం జరుగుతున్నా, వంతెనలు కూలిపోతున్నా, నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయినా ఈ అంధభక్తుల కళ్లకు పొరలు కమ్మేసి గుడ్డిగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. సమస్యలు చూడలేకపోతున్న 'అంధ భక్తుల' కోసమే ఈ కళ్లజోడు అని రేణుకా చౌదరి అన్నారు.

**ఉచితంగా చికిత్స అందిస్తాం:**

హిందీలో కంటి శుక్లాలు వ్యాధిని 'మోతి-యాబింద్' అని పిలుస్తారు. అయితే రేణుకా చౌదరి 'మోతియా' అనే పదాన్ని ప్రధాని నరేంద్ర 'మోడి' పేరుతో కలిపి, వ్యంగ్యంగా మోడియా బింద్‌గా మార్చారు. మోడీయా బింద్ వ్యాధివచ్చి అంధభక్తులకు తాము ఉచిత చికిత్స అందించే ఏర్పాటు చేస్తామంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఏం జరిగినా గుడ్డిగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న వారి తీరును ఎండగట్టేందుకే తాను ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. కాగా రేణుకా చౌదరికి సంబంధించిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# అర్హత లేకున్నా వైద్యం..



**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** గ్రామీణ ప్రాంతాలలో అత్యవసర వైద్య చికిత్సలు అందించేది ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులే. చిన్న పాటి జ్వరం వచ్చినా, నొప్పి వచ్చినా సమయం సందర్భం లేకుండా చికిత్సలు అందించడంలో ముందుంటారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలు వారి పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో వస్తున్నాయి. అయినా వారు పరిధి దాటి చికిత్స అందించకుండా కట్టడి చేయడంలో వైద్యశాఖ పూర్తిగా విఫలం అవుతుందనే ప్రచారం సాగుతోంది. కామారెడ్డి జిల్లాలో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న శంకర్ దాదాల ముఠా రెచ్చిపోతోంది. వైద్య విద్య లేకుండానే కత్తులు పట్టి ఆపరేషన్లు చేస్తూ, తక్కువ ఫీజు పేరుతో పేదలను బుట్టలో వేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

**డిగ్రీ లేదు.. కానీ ఆపరేషన్**

కామారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో బోర్డులు, రిజిస్ట్రేషన్ ఏమీ లేకుండా ఆర్‌ఎంపీ, పిఎంపి వైద్యులు ఇళ్లల్లోనే చిన్న గదులను క్లినిక్‌లుగా మార్చారు. వైద్య విద్య, డిగ్రీ లేని కొంతమంది శంకర్ దాదాల అవతారమెత్తి కుట్లు వేయడం, కురుపులకు ఆపరేషన్, చిన్న చిన్న శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కొంతమంది ఏకంగా డెలివరీలు సైతం చేస్తున్నట్టుగా సమాచారం. స్టెరిలైజేషన్ పరికరాలు లేవు. ప్రమాణాలు లేవు. అయినా నిర్భయంగా కత్తులు పట్టి కోతలు పెడుతున్నారు. ఇన్ఫెక్షన్ వచ్చినా, పరిస్థితి చేయిదాటినా బాధ్యత తీసుకునేవారు కరువవుతున్నారు.

**పేదరికమే వారి టార్గెట్..**

ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే తీరిక లేదు. ప్రైవేట్‌కు వెళ్లే స్తోమత లేదు. ఈ నిస్సహాయతను ఈ ముఠా క్యాష్ చేసుకుంటోంది. వెయ్యి రూపాయల్లో పని అయిపోతుంది అంటూ కూలీలు, రోజువారీ కార్మికులను ఆకర్షిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని నమ్మించి ఆపరేషన్ చేసిన తర్వాత సమస్య వస్తే మాత్రం మా వల్ల కాదు, పెద్ద ఆసుపత్రికి వెళ్ళండి అంటూ చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా చిన్న గాయానికి వెళ్లి పెద్ద ప్రమాదాన్ని కొని తె-స్తున్న ఘటనలు పెరుగుతున్నాయి.

**తెల్లారేసరికి ఆధారాలు మాయం..**

ఈ అక్రమ క్లినిక్‌లలో ఎక్కువగా రాత్రి వే-ళల్లోనే ఇలాంటి అర్హత లేని వైద్యం నడు-స్తున్నది. ఏదైనా ఫిర్యాదు వెళ్లి పోలీసులు లేదా వైద్యాధికారులు వస్తున్నారనే సమాచారం అందగానే షట్టర్ డౌన్ చేస-్తున్నారు. లోకల్ వ్యక్తులను కాపలాకు పెట్టుకుని ముందే సమాచారం రాబడుతున్నారు. తెల్లవారేసరికి పరికరాలు, మందులు అన్నీ మాయం చేస్తున్నారు. దీంతో దాడులు చేసిన ఆధారాలు దొరకడం లేదు.


**అధికారుల తనిఖీలు శూన్యం..**

జిల్లాలో ఇలాంటి అక్రమ వైద్యం యథేచ్ఛగా సాగుతున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఫిర్యాదులు వచ్చినా ఫైళ్లకే పరిమితమవ-ుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలను ఉల్లంఘించి ప్రజారోగ్యంతో ఆడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలిగిన అధికారుల మౌనం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపి క్లినిక్ లను తనిఖీలు చేయాల్సిన ఉన్నతాధికారులు ప్రతినెలా వాళ్ళ నుంచి వచ్చే ముడుపులకు అలవాటు పడి అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కట్టడి చేస్తారా..?**

డబ్బులు లేక వీరి దగ్గరకు వెళ్తే వైద్యం వికటించి ప్రాణాలు పోతున్నాయి. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించాలని, అక్రమంగా ఆపరేషన్లు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని బాధిత ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. పేదల ప్రాణాలు పణంగా పెట్టి సాగుతున్న ఈ అక్రమ వైద్యాన్ని అరికట్టడానికి అధికారులు ఎప్పుడు కదులుతారోనని కామారెడ్డి ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# ఆగస్టు 13 నుంచి ఉచిత హార్ట్ సర్జరీలు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్ తెలిపారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ ప్రొ. అమరేశ్వర్ నేతృత్వంలో ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి ఈ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. లండన్‌కు చెందిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా.రమణ తన్నషనేని, సాంకేతిక నిపుణుల బృందం సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్సలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం నిమ్స్‌లో ఈ ఉచిత గుండె శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

**వాక్ ఇన్ విధానంలో చిన్నారుల పరిశీలన:**

అవసరాన్ని బట్టి ప్రాధాన్యత కేటాయిస్తూ వాక్-ఇన్ విధానంలో చిన్నారులను పరిశీలిస్తామని దేవరాజు తెలిపారు. అవ-సరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇందుకోసం సోమవారం నుంచి శనివారం వరకు, ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు సీటీ సర్జరీ కార్యాలయం, మొదటి అంతస్తు, పాత బ్లాక్, నిమ్స్, పంజాగుట్ట, హైదరాబాద్ లో సంప్రదించాలని సూచించారు. అలాగే ఫోన్ 040-2348-9025 ద్వారా సంప్రదించాలన్నారు. అందుబాటులో ఉంటే పాత వైద్య రిపోర్టులు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

## మహిళా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా
# ప్రొఫెసర్ గడ్డం మల్లేశం



**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం గారు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సీ--ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో, మాజీ చీఫ్ సెక్రటరీ శ్రీ కాకి మాధవరావు గారి నేతృత్వంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ భవన్, లోయర్ ట్యాంక్ బండ్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, గ్రూప్--1 అధికారులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు పాల్గొని ప్రొఫెసర్ గడ్డం మల్లేశం గారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ESI డైరెక్టర్ డాక్టర్ గౌతమ్, డాక్టర్ సిద్ధోజ్, డాక్టర్ ప్రకాష్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మంగు గారు, మాజీ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్, మరో మాజీ హెడ్ ప్రొఫెసర్ రమణ రావు, ప్రొఫెసర్లు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుగూరి బాబు, అడ్వకేట్ లక్ష్మణ్, ఇంజనీరింగ్ స్కాలర్ కృష్ణ రాథోడ్, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, స్కాలర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ గడ్డం మల్లేశం గారు విద్యా రంగంలో విశేష అనుభవం కలిగిన విద్యావేత్తగా, పరిపాలనా దక్షత కలిగిన వ్యక్తిగా, సామాజిక స్పృహతో పనిచేసే ప్రముఖుడిగా పలువురు వక్తలు కొనియాడారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని విద్య, సమానత్వం, మహిళా సాధికారతకు ఒక ఆదర్శ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడంలో ఆయన నాయకత్వం కీలకంగా ఉంటుందని వారు ఆకాంక్షించారు. రాబోయే కాలంలో గొప్ప గొప్ప పదవులు చేపట్టాలని పలువురు కొనియాడారు ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం గారు మాట్లాడుతూ, మహిళల ఉన్నత విద్యాభివృద్ధి, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక సాధికారతకు విశ్వవిద్యాలయం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. "విద్య ద్వారా సాధికారత -- సమాజ అభివృద్ధికి బలమైన పునాది" అనే లక్ష్యంతో విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

-ఎస్సీ-ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం



# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి,జలాశయాలు, చెరువులు నిండి,పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. సోమవారం నాగార్జునసాగర్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డి,ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, జలాశయాలు,చెరువులు పూర్తిస్థాయిలో నిండి సాగు మరియు తాగునీటి అవసరాలు తీరాలని,రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,రైతులు ఆనందంగా ఉండాలని,ప్రతి గ్రామం పచ్చదనంతో కళకళలాడాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ పట్టణ కేంద్రంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుజలదాత నిరంతరం భువనగిరి నియోజకవర్గం ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం అభివృద్ధి కోసం పనిచేసిన పైళ్ళ శేఖర్రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వలిగొండ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి, శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి, వలిగొండ మాజీ ఎంపిటిసి పల్సశీ రమేష్, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అఫ్రోజ్, కొమురెల్లి సంజీవరెడ్డి, మోటే నరసింహ, సర్పంచ్ బొడిగే లింగస్వామి, మాజీ సర్పంచ్ గంగారం రమేష్, ఆకుల వెంకన్న, బొడ్డుపల్లి కృష్ణ, ఐటిపాముల సత్యనారాయణ, నాయకులు కొండూరు వెంకటేశం, బొల్లు కృష్ణ, సోమనబోయిన సతీష్, సోమనబోయిన రమేష్, బాలేశ్వర్, బలుగూరి నరేష్ రెడ్డి, పోలేపాక సత్యనారాయణ, పల్సం రాజు, ఎడవెల్లి శాంత్ కుమార్, ప్రభాకర్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు కూచిమల్ల సుధాకర్, కాసుల పెద్దలు, కాశమల్ల శేఖర్, నానమాల ఉప్పలయ్య, చెవ్వ వెంకటేశం, బూడిద పాపయ్య, కూచిమల్ల నాగేష్, నాగేందర్, గట్టు పాపయ్య, కుమార్, రమేష్, బత్తుల ఆంజనేయులు, గుండు శేఖర్, బూడిద రాజు, మండల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కార్యకర్తలు, అభిమానులు భారీఎత్తున పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలల్లో యోగా, స్వీయ రక్షణ బోధకుల ఎంపికకు పరీక్షలు, డెమో నిర్వహణ





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో యోగా, స్వీయ రక్షణ శిక్షణ అందించేందుకు బోధకుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో పరీక్షలు, డెమో నిర్వహించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో 15 యోగా టీచర్ పోస్టులకు గాను 22 మంది అభ్యర్థులు పరీక్ష, డెమోకు హాజరయ్యారు. అలాగే 15 స్వీయ రక్షణ (Self Defence) ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు గాను 37 మంది అభ్యర్థులకు పరీక్ష, డెమో నిర్వహించారు. అదే విధంగా అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ కోసం ఎంపిక ప్రక్రియ కూడా నిర్వహించారు. ఇందుకోసం జిల్లాకు చెందిన 10 మంది ఉపాధ్యాయులు పరీక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాలకు చెక్..



**అడవిదేవలపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నేరాలు,అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రజలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్ సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేర పరిశోధనలో కీలక ఆధారాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా కెమెరాల నిఘా ఉన్న ప్రాంతాల్లో చోరీలు, ఆకతాయి వేధింపులు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, తమ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని వారు కోరారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు చర్యలు మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్‌కు రూ.50 లక్షల చెక్కు

**కోరుట్ల,ఫ్లాష్ ఇండియా :** రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ ఎం.డి. మాదర్‌కు ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలిచింది. యూబీఐ పథకం కింద ప్రమాద బీమా పరిహారంగా రూ.50 లక్షల చెక్కును అందజేశారు. కోరుట్ల డిపోకు చెందిన డ్రైవర్ ఎం.డి. మాదర్ 09.10.2025న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తన కుడి కాలును కోల్పోయారు. ఈ నేపథ్యంలో యూబీఐ పథకం కింద లభించిన ప్రమాద బీమా ప్రయోజనంలో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం రూ.50 లక్షల చెక్కును అందించింది. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, యూబీఐ బ్యాంక్ సీజీఎం ఎం. రవీంద్రబాబు, డీజీఎం ఎన్. సత్యనారాయణ బాబ్జి, ఏజీఎం రంజన్ కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో బాధిత డ్రైవర్ ఎం.డి. మాదర్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పి. సోలోమన్, సిహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి. రాజు, కోరుట్ల డిపో మేనేజర్ ఎన్. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి




**భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** 12వ జాతీయ బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ జాతీయ బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, అవి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే ఈ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులను వేలం వేయడం వల్ల సింగరేణి సంస్థతో పాటు లక్షలాది మంది కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాకులను వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కోయగూడెం ఓసీ-3 బొగ్గు గనిని కూడా సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాస్తారోకో

**టేకులపల్లి,ఫ్లాష్ ఇండియా :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ టేకులపల్లి మండల కేంద్రంలోని బోడు రోడ్డు సెంటర్‌లో సోమవారం సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జైల్‌భరో కార్యక్రమాన్ని చేపట్టారు. కుంజ హైమావతి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు సంబంధించిన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని, నూతన విత్తన, విద్యుత్ చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం చేయాలని కోరారు. కార్మిక, కర్షక ఐక్యతతో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, సీఐటీయూ మండల కన్వీనర్ కుంజ హైమావతి, రైతు సంఘం మండల కార్యదర్శి పూనెం స్వామి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కుంజ రమేష్, కోయగూడెం వార్డు సభ్యుడు పూనెం చంద్రశేఖర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పూనెం శిరోమణి, బి.లక్ష్మి, జి.లక్ష్మి, విద్య, మంగ, చైతన్య, మాధవి, ఈసం రామకృష్ణ, నాగేంద్రబాబు, పూనెం బుచ్చయ్య, ప్రేమ్‌కుమార్, సుదర్శన్, మాడె శేఖర్, చింత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామంగా ప్రకటించాలి



**గంగాధర,ఫ్లాష్ ఇండియా :** నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించాలని, గ్రామ ప్రజలపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. గ్రామానికి చెందిన పలువురు ప్రజలు దీక్షలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకుడు కొత్త జైపాల్ రెడ్డి గ్రామస్తులకు మద్దతు ప్రకటించి వారితో కలిసి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. "మమ్మల్ని రెండుగా చీల్చొద్దు.. నారాయణపూర్ గ్రామాన్ని మొత్తాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి. అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని డిమాండ్ చేశారు.

**హామీ నిలబెట్టుకోవాలి: సుంకె రవిశంకర్**

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. నారాయణపూర్ గ్రామ ప్రజలు తనను నమ్మి ఎన్నో సందర్భాల్లో అండగా నిలిచారని, గ్రామ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించానని అన్నారు. గ్రామ ప్రజలపై కేసులు పెట్టడం, వారిని భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించేందుకు కృషి చేస్తానని ఇచ్చిన హామీని ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణపూర్‌తో పాటు మంగపేట, చెర్లపల్లి, ఇస్తారిపల్లి తదితర గ్రామాల సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. "ఎమ్మెల్యే అంటే ప్రజలకు ధైర్యం ఇవ్వాలి కానీ భయపెట్టడం, కేసులు పెట్టడం కాదు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది" అని రవిశంకర్ పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కుల కోసం ప్రశ్నించినప్పుడు కేసులు పెట్టడం సరికాదని, నారాయణపూర్ ప్రజల కన్నీళ్లు,, ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. పోలీసులు కూడా ప్రజల రక్షణకు పనిచేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు.

**హామీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి: కొత్త జైపాల్ రెడ్డి**

కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నారాయణపూర్ గ్రామ ప్రజలంతా ఒక కుటుంబంలా ఐక్యంగా చేపడుతున్న ఈ రిలే నిరాహార దీక్షకు ప్రధాన కారణం గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించాలన్న డిమాండేనన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు మేడిపల్లి సత్యం నారాయణపూర్ గ్రామానికి వచ్చి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలపై కేసులు నమోదు చేసి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తే అది సాధ్యం కాదన్నారు. గ్రామంలో లేని వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పోలీసులను కోరారు. "తప్పుడు కేసులతో నారాయణపూర్ ప్రజల ఉద్యమాన్ని ఆపలేరు. గ్రామ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారి వెంట ఉండి పోరాడుతాం" అని జైపాల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గ్రామ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. లేనిపక్షంలో దీక్షను జిల్లా కేంద్రం కరీంనగర్‌కు తరలించి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# టీమిండియా కోచ్ కీలక అప్డేట్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. శ్రీలంక క్రికెట్ ఇ×తో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పడిక్కల్ 164 బంతుల్లో 142 పరుగులతో ఆకట్టుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో భారీ షాట్లతో పాటు క్రీజులో నిలదొక్కుకునే సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనతో శ్రీలంకతో గాలే వేదికగా జరగనున్న తొలి టెస్టులో పడిక్కల్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందా అనే చర్చ మొదలైంది. దీనిపై టీమిండియా స్పిన్ బౌలింగ్ కోచ్ సైరాజ్ బహుతులే స్పందించారు. పడిక్కల్‌కు ప్రాక్టీస్ మ్యాచ్‌లో లభించిన అవకాశాన్ని అతను అద్భుతంగా ఉపయోగించుకున్నాడని ప్రశంసించారు. పడిక్కల్ తనను తాను నిరూపించుకున్నాడని, భారీ స్కోర్ చేయడం ద్వారా మంచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకున్నాడని బహుతులే పేర్కొన్నారు. అయితే తొలి టెస్టులో అతడిని ఆడించాలా వద్దా అనే నిర్ణయం మాత్రం గాలేకు చేరుకున్న తర్వాతే తీసుకుంటామని స్పష్టం చేశారు. పిచ్ పరిస్థితులు, జట్టు అవసరాలను పరిశీలించిన అనంతరం తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా.. గాలే టెస్టులో భారత జట్టు స్పిన్ విభాగంపైనా ఆసక్తి నెలకొంది. జట్టులో నలుగురు స్పిన్నర్లు తమదైన ప్రత్యేకత కలిగి ఉన్నారని బహుతులే తెలిపారు. రవీంద్ర జడేజాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన అనుభవం ఉందని, మానవ్ సుతార్ కచ్చితమైన బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడని చెప్పారు. అలాగే శారాంశ్ జైన్ దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు ఇచ్చి జట్టులో చోటు సంపాదించుకున్నాడని పేర్కొన్నారు. గాలే పిచ్ స్వభావాన్ని పరిశీలించిన తర్వాత స్పిన్నర్ల కాంబినేషన్‌పై కూడా నిర్ణయం తీసుకుంటామని బహుతులే వెల్లడించారు. దీంతో తొలి టెస్టులో భారత తుది జట్టులో ఎవరెవరికి చోటు దక్కుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, భారత్, శ్రీలంక మధ్య తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో 142 పరుగులతో మెరిసిన పడిక్కల్‌కు తుది జట్టులో అవకాశం దక్కుతుందా లేదా అనేది గాలేలో పిచ్ పరిస్థితుల ఆధారంగా తేలనుంది.

# వరల్డ్ అండర్-20 అథ్లెటిక్స్‌లో బసంత్ న్యూ రికార్డ్స్




వరల్డ్ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ బసంత్ కుమార్ మేఘ్వాల్ అద్భుత ప్రదర్శనతో చారిత్రాత్మక రికార్డు సృష్టించాడు. హైజంప్ విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకుని, ఈ ప్రపంచ టోర్నీలో హైజంప్‌లో పతకం సాధించిన తొలి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 19 ఏళ్ల బసంత్ తన అత్యుత్తమ ప్రదర్శనతో 2.21 మీటర్ల ఎత్తు దూకి రెండవ స్థానంలో నిలిచాడు. పోటీలో అల్జీరియాకు చెందిన యూన్స్ అయాచి, బ్రిటన్‌కు చెందిన ఓటిస్ పూల్ కూడా సరిగ్గా 2.21 మీటర్ల ఎత్తునే దాటడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఈ ముగ్గురు అథ్లెట్లు తర్వాత టార్గెట్ 2.24 మీటర్లను దాటడంలో విఫలమవ్వడంతో, అంతకుముందు వారు సాధించిన స్కోర్ ఆధారంగా స్థానాలను ఖరారు చేశారు. ఇందులో భాగంగా యూన్స్ అయాచి స్వర్ణ పతకం గెలవగా, బసంత్ కుమార్‌కు రజతం, ఓటిస్ పూల్‌కు కాంస్య పతకం దక్కాయి. భారత మాజీ జాతీయ రికార్డు హోల్డర్ సహానా కుమారి శిక్షణలో రాటుదేలిన బసంత్ కుమార్, ఈ టోర్నీలో ఊహించని రీతిలో రాణించాడు. అంతకుముందు వరకు అతడి వ్యక్తిగత ఉత్తమ రికార్డు 2.11 మీటర్లుగా ఉండగా, సహానా మార్గదర్శకత్వంలో తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని ఏకంగా 10 సెంటీమీటర్లు అధికంగా దూకి 2.21 మీటర్ల మైలురాయిని చేరుకున్నాడు. ప్రపంచ స్థాయిలో భారత్ పేరును నిలబెట్టిన బసంత్ సాధించిన ఈ చారిత్రక విజయం దేశంలోని యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలిచింది.

# కేంద్రాన్ని సంప్రదించనున్న బీసీసీఐ



బంగ్లాదేశ్, భారత్ మధ్య రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనపై సందిగ్ధత నెలకొంది. గతేడాది ఇరు జట్ల మధ్య జరగాల్సిన వైట్‌బాల్ సిరీస్ బిజీ షెడ్యూల్ కారణంగా ఈ ఏడాదికి వాయిదా పడింది. అయితే, ఐపీఎల్-2026 నుంచి కోల్‌కతా నైట్‌రైడర్స్ బంగ్లా బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీజ్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ కారణంతోనే ఈ ఏడాది భారత్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ జట్టు పాల్గొనలేదు. దీంతో ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు క్షీణించాయి. గతేడాది వాయిదా పడిన వైట్‌బాల్ సిరీస్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 15 వరకు షెడ్యూల్ చేసింది. ఇందులో మూడు వన్డేలు, మూడు టీ20లు జరగాల్సి ఉంది. అయితే, భారత జట్టు బంగ్లాకు వెళ్తుందా? అన్న దానిపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లా పర్యటనపై బీసీసీఐ సొంతంగా నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయంపై తాము భారత ప్రభుత్వాన్ని సంప్రదించనున్నట్టు బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రతిపాదిత వైట్‌బాల్ సిరీస్ గురించి బంగ్లా క్రికెట్ బోర్డు లేఖ రాసిందని, ఇరు బోర్డులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.



# ఇంతకీ ఏం జరిగిందంటే?

కామన్వెల్త్ గేమ్స్ 2026 పతక విజేత బాక్సర్ నరేంద్ర బేర్వాల్.. ప్రధాని నరేంద్ర మోదీని నవ్వించాడు. పతకాలు సాధించిన అథ్లెట్లు మోదీని కలిసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాక్సర్ నరేంద్ర.. మోదీకి చెప్పిన ఓ సరదా సంఘటన అందరినీ నవ్వించింది. 2015 మిలిటరీ వరల్డ్ గేమ్స్‌లో పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిన పోరును గుర్తుచేసుకున్న బేర్వాల్.. ఆ మ్యాచ్ తర్వాత అతడు చెప్పిన మాటలను మోదీకి వివరించాడు.'2015 మిలిటరీ వరల్డ్ గేమ్స్‌లో నా తొలి రౌండ్ పోరు పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగింది. పాకిస్థాన్ ఆటగాడితో ఓడిపోవద్దని అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు చెప్పేవారు. ఆ మ్యాచ్‌లో నేను గెలిచాను. అయితే పోరులో ఇద్దరికీ గాయాలయ్యాయి. దీంతో ఆసుపత్రికి వెళ్లాం. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేంద్ర రాణా. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా.. పాక్ బాక్సర్ ఓ విషయాన్ని గమనించాడు. 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నా' అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేంద్ర. మీ కోచ్ పేరు నరేంద్ర. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఈ పేరు అంటేనే అసహ్యం వచ్చేసింది' అన్నాడు' అని బాక్సర్ బేర్వాల్ చెప్పాడు. దీనికి మోదీ గట్టిగా నవ్వేశారు.

# బిజినెస్

## భారత్‌కు రూ. 19 లక్షల కోట్ల ప్రత్యామ్నాయ మార్కెట్



రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించినా, భారత్ తన ఎగుమతులను ఇతర దేశాలకు మళ్లించే అవకాశం ఉందని ఆర్థికవేత్త ఎస్ పీ శర్మ తెలిపారు. అమెరికాకు భారత్ ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న ఉత్పత్తులకే మరో 15 దేశాల్లో దాదాపు 200 బిలియన్ డాలర్ల(రూ. 19.04 లక్షల కోట్ల) మార్కెట్ అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. అమెరికాకు భారత్ చేసే వస్తువుల ఎగువ-ంతుల విలువ సుమారు 87--88 బిలియన్ డాలర్లు(రూ. 8.37 లక్షల కోట్లు) కాగా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, యూకే, లాటిన్ అమెరికా దేశాలు, సౌదీ అరేబియా, యూఏఈ, నేపాల్ వంటి మార్కెట్లలో ఇదే ఉత్పత్తులకు మరింత స్థలం ఉందని శర్మ పేర్కొన్నారు. అంతేకాకుండా, అమెరికాకు భారత ఎగుమతులు 10--15 శాతం వృద్ధి చెందుతుంటే, ఇతర మార్కెట్లకు ఎగుమతుల వృద్ధి 20--25 శాతం మధ్య ఉందని ఆయన చెప్పారు. అంటే, అమెరికా మార్కెట్ కీలకమైనదే అయినా, భారత్ దానిపైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. సుంకాల అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఎగుమతులు 2024-25లో 86.5 బిలియన్ డాలర్ల(రూ. 8.23 లక్షల కోట్ల) నుంచి 2025-26లో 87.3 బిలియన్ డాలర్ల(రూ. 8.31 లక్షల కోట్ల)కు పెరగడం కూడా ఎగుమతిదారుల సామర్థ్యాన్ని చూపిస్తోందని శర్మ అన్నారు.అయితే, అమెరికా భారత్‌కు ఇప్పటికీ అత్యంత ముఖ్యమైన వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగానే ఉంది. అమెరికా మార్కెట్లో భారత ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉండటం, ధరల విషయంలో భారత్ పోటీ పడుతుండటం, ముఖ్యంగా శ్రమ ఆధారిత ఉత్పత్తులను పెద్ద ఎత్తున సరఫరా చేయడం దీనికి కారణం. అందుకే రెండు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగిస్తున్న సమ-యంలో భారీ సుంకాలు విధించడం ఇరు దేశాలకూ నష్టమేనని శర్మ అభిప్రాయపడ్డారు. భారత్ తక్కువ ఖర్చుతో మెరుగైన సరఫరాదారుగా ఉండటంతో, భారత ఉత్పత్తులపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తే ఆ ప్రభావం అమెరికా వినియోగదారులపైనా పడొచ్చని ఆయన అన్నారు. దిగుమతి ఖర్చులు పెరగడంతో అమెరికాలో వస్తువుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణ ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.




# హోటళ్లలో వైఫై వాడేవారికి మైక్రోసాఫ్ట్ హెచ్చరిక

ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికులు, హోటళ్లలో బస చేసే వారిని లక్ష్యంగా చేసుకుని భారీ సైబర్ దాడులు జరుగుతున్నాయని మైక్రోసాఫ్ట్ థ్రెట్ ఇంటెలిజెన్స్ బృందం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. పబ్లిక్ మరియు హోటల్ వైఫై నెట్‌వర్క్‌ల ద్వారా జరుగుతున్న ఈ ఇంటర్నెట్ హైజాకింగ్ దాడిని 'క్యాప్టివ్‌క్రంచ్' గా అభివర్ణించింది. ఈ ఇంటర్నెట్ హైజాకింగ్ దాడి వెనుక రష్యాకు చెందిన ప్రముఖ హ్యాకింగ్ గ్రూప్ 'మిడ్‌నైట్ బ్లిజార్డ్' (స్టార్మ్-2945) ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేసింది.

**స్క్రీన్, ఆడియో రికార్డింగ్ ప్రమాదం!:**

ఈ సైబర్ దాడులు అత్యంత ప్రమాదకరంగా పరిణమించాయని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. హోటళ్లు, ఎయిర్‌పోర్టులు, కాన్ఫరెన్స్ సెంటర్లలో ఉచిత వైఫై కి కనెక్ట్ అయిన వెంటనే హ్యాకర్లు సదరు పరికరాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారని, ఈ మాల్వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశించగానే యూజర్ స్క్రీన్‌ను రికార్డ్ చేయడం, ఆడియో-వీడియో సంభాషణలను వినడం, స్క్రీన్‌షాట్లు తీయడం వంటివి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అలాగే కీబోర్డ్‌పై టైప్ చేసే ప్రతి అక్షరాన్ని, బ్రౌజర్‌లో సేవ్ చేసిన పాస్‌వర్డ్‌లను, మైక్రోసాఫ్ట్ 365 లాగిన్ వివరాలను హ్యాకర్లు రికార్డ్ చేస్తున్నట్లు పేర్కొంది.

**నకిలీ నోటిఫికేషన్లతో ఎంట్రీ:**

బ్రౌజర్ అప్‌డేట్ చేయండి, విండోస్ సెక్యూరిటీ స్కాన్ చేయండి లేదా గూగుల్ సెక్యూరిటీ చెక్ పూర్తయింది అంటూ నకిలీ పాప్-అప్‌లను చూపిస్తూ యూజర్ల చేత హానికర సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నట్లు గర్తించారు. ఒక్కసారి ఈ మాల్వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తే.. హ్యాకర్లు కీబోర్డ్ టైపింగ్‌ను రికార్డ్ చేయడం, ఆడియో-వీడియో రికార్డింగ్, పాస్‌వర్డ్‌లు, బ్రౌజర్ కుకీలను దొంగిలించడంతో పాటు కంప్యూటర్‌ను రిమోట్‌గా నియంత్రించగలరని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది.

**ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**


అందువల్ల హోటళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లోని వైఫైని ఉపయోగించకపోవడమే శ్రేయ-స్కరం. వ్యక్తిగత మొబైల్ హాట్‌స్పాట్ లేదా ఎన్‌క్రిప్టెడ్ ప్రైవేట్ కనెక్షన్‌లను వాడాలని, అనుమానాస్పద పాప్-అప్‌లను నమ్మవద్దని, ప్రయాణాల్లో ఉన్నప్పుడు ఉద్యోగులు పబ్లిక్ నెట్‌వర్క్‌లలో సున్నితమైన కార్పొరేట్ సమాచారాన్ని, ఖాతా వివరాలను ఎంటర్ చేయకుండా జాగ్రత్త వహించాలని మైక్రోసాఫ్ట్ థ్రెట్ ఇంటెలిజెన్స్ బృందం హచ్చరించింది.

# తగ్గిన బంగారం ధరలు..



గత కొద్దిరోజులనుంచి పెరుగుతూ పోయిన బంగారం ధరలు ఈ రోజు (సోమవారం) తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 380 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 350 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 280 రూపాయలు తగ్గింది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,51,970 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,39,300 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,13,980 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# సంస్కరణల వేగం పెంచండి..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలను మరింత వేగంగా అమలు చేసి, వ్యాపారం చేయడం సులభతరం చేయాలని ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి ఛైర్మన్ ఆర్ సీ భార్గవ పిలుపునిచ్చారు. సంపదను సృష్టించే సంస్కరణలకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని, ప్రభుత్వం-ప్రతిపక్షాలు కలిసి ఆ అదనపు వనరులను మరింత సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి వినియోగించాలని ఆయన సూచించారు. సాంకేతికత వినియోగాన్ని పెంచితే అవినీతి, జాప్యాలు తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు కూడా తగ్గుతాయని భార్గవ అన్నారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ఆటో మార్కెట్‌లో కనిపిస్తున్న వేగాన్ని ప్రస్తావిస్తూ, 2030-31 నాటికి భారత కార్ల మార్కెట్ 61-63 లక్షల యూనిట్లకు చేరొచ్చని, చిన్న కార్ల అమ్మకాలు కూడా గత ఐదేళ్లతో పోలిస్తే వేగంగా పుంజుకునే అవకాశం ఉందని చెప్పారు. కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాత 2025 ద్వితీయార్థంలో మారుతీ రిటైల్ అమ్మకాలు 17 శాతం పెరిగాయని, 2026-27 తొలి త్రై-మాసికంలో పరిశ్రమ 28 శాతం వృద్ధి చెందగా, కంపెనీ అమ్మకాలు 38 శాతం పెరిగాయని తెలిపారు. ఇదే సమయంలో, నెట్‌జీరో లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒకే ఇంధన సాంకేతికతపై ఆధారపడకుండా అనేక మార్గాలను ఉపయోగించాల్సిన అవసరం ఉందని భార్గవ అన్నారు. స్థానిక వనరులతో పెద్ద ఎత్తున బయోగ్యాస్ ఉత్పత్తి చేసి, దిగుమతి చేసుకునే సీఎన్‌జీకి ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చని ఆయన పేర్కొన్నారు.



# మమిత బైజు రూటే సపరేట్

ఈ మధ్యకాలంలో సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని ఆసక్తి ఉన్నవారు ముందుగా సోషల్ మీడియాలో మంచి క్రేజ్ సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో పాపులారిటీ వస్తే సినిమాల్లో అవకాశాలు దక్కిన సందర్భాలు చాలానే ఉండటంతో.. చాలా మంది ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అలాగే కొత్తగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బ్యూటీలతో పాటు సీనియర్ హీరోయిన్లు కూడా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అప్పుడప్పుడు తమ అందచందాలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. సినిమాల్లో అవకాశాలు రావాలన్నా, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో మంచి స్థాయికి చేరుకోవాలన్నా.. ప్రస్తుతం సోషల్ మీడియా కూడా కీలకంగా మారిపోయింది. అలాంటి సమయంలో యంగ్ బ్యూటీ మమిత బైజు మాత్రం సోషల్ మీడియాకు దూరంగా ఉండనున్నట్లు ప్రకటించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం తాను మానసిక ప్రశాంతతను కోరుకుంటున్నానని, అందుకే సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పుకొచ్చింది. యంగ్ హీరోయిన్లు చాలామంది సోషల్ మీడియాలో తమ అందచందాలను ప్రదర్శిస్తూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకుంటున్న సమయంలో.. మమత బైజు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం మమిత బైజు ఈ విషయంలో ధైర్యమైన నిర్ణయం తీసుకుందని, ఆమె రూటే సపరేట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.



# యశ్‌పై నయనతార కామెంట్స్

ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ విషయాల్లో ‘టాక్సిక్’ ట్రైలర్ ఒకటి. యశ్ ప్రధాన పాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఆగస్టు 26న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ప్రజెంట్ అత్యధిక వ్యూస్‌తో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తాజాగా ఏర్పాటు చేసిన ఈ ట్రైలర్ ఈవెంట్‌లో యశ్‌పై ప్రశంసలు కురిపించింది నయనతార. ‘యశ్ అంతటి కష్టపడే తత్వం ఉన్న నటుడిని నేను ఎప్పుడూ చూడలేదు. టాక్సిక్ షూటింగ్ సెట్‌లో ఆయన పనితీరు చూసి ప్రతిరోజూ ఆశ్చర్యపోయేదాన్ని. ఆయన తన జీవితంలో నాలుగైదు ఏళ్లను దీనికోసం కేటాయించారు. కుటుంబం, పిల్లలతో గడిపే సమయాన్ని కూడా త్యాగం చేసి, కేవలం పనిపైనే దృష్టి పెట్టారు. ఒక నటుడు దర్శకుడి పట్ల ఇంత శ్రద్ధ వహించడం నేనెప్పుడూ చూడలేదు. నటుడిగా, నిర్మాతగా మరియు ఒక వ్యక్తిగా ఆయన పట్ల నాకు ఎంతో ప్రేమ, గౌరవం ఉన్నాయి. అందుకే కేవలం ఆయన పిలిచారు అనే నేను ఈ ప్రచార కార్యక్రమాని హాజరయ్యాను’ అంటూ యశ్ నటనపై, ఆయన డెడికేషన్‌పై ప్రశంసలు కురిపించింది నయన్. కాగా.. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఆగస్టు 26న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ ,ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది.

# భారత్‌లో రికార్డులు బద్దలు కొట్టిన స్పైడర్ మ్యాన్




హాలీవుడ్ సూపర్‌హీరో మూవీ “స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే” భారత బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను రాబట్టుకుంటున్న ఈ సినిమా, దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రంగా నిలిచి సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు భారత బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.462 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించి ట్రేడ్ పండితులను సైతం విస్మయానికి గురిచేసింది. భారతీయ మార్కెట్‌లో హాలీవుడ్ సినిమాలకు ఉన్న ప్రాభవాన్ని, ముఖ్యంగా స్పైడర్ మ్యాన్ పాత్రకు ఉన్న అపారమైన ప్రజాదరణను ఈ బాక్సాఫీస్ సునామీ మరోసారి చాటిచెప్పింది.

# నిర్మాతకు కలిసిరానున్న ఆ డేట్!




మెగా హీరో సాయి ధరమ్ తేజ్ ‘సంబరాల ఏటిగట్టు’ చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నాడు. ‘హనుమాన్’ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాతో ఇండియాన్ షేక్ చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజువల్ వండర్‌గా రాబోతున్న ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకోంటున్న ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ అప్డేట్ నెట్టింట దర్శనమిచ్చింది. సంబరాల ఏటిగట్టు చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా విడుదల చేసేందుకు జనవరి 12వ తేదీని పరిశీలిస్తున్నారని ఫిలిమ్ వర్గాల నుంచి వార్తలు వస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ దాదాపుగా పూర్తి కావస్తున్నట్లు తెలుస్తుండగా.. సంక్రాంతికే రిలీజ్ చేయాలని గట్టి ప్లాన్‌లో ఉన్నారట. అంతే కాకుండా.. 2024 సంక్రాంతికి చిత్రం కూడా జనవరి 12నే విడుదలైంది.. కాబట్టి నిరంజన్‌రెడ్డి నిర్మాణ సంస్థకు ఇది ఒక ప్రత్యేకమైన తేదీ కాబోతుందని ఈ డేట్‌నే ఫిక్స్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. మరి వైరల్ అవుతున్న ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తెలియాలంటే అఫీషియల్ అప్డేట్ వచ్చే వరకు వేచి చూడాల్సి ఉంది.

# ‘టాక్సిక్’ కోసం ఏకంగా అన్ని కోట్లు?



దక్షిణాది యువ కథానాయిక రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా యష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘టాక్సిక్’ చిత్రంలో ఆమె కీలక పాత్రలో నటించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ‘టాక్సిక్’ సినిమా కోసం రుక్మిణి వసంత్‌కు సుమారు రూ.3 కోట్ల పారితోషికం అందినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో రుక్మిణి వసంత్ మార్కెట్ కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది.దీంతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న యువ కథానాయికల్లో ఆమె ఒకరిగా నిలుస్తున్నారు. ‘టాక్సిక్’లో యష్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. భారీ తారాగణం, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కిన ‘టాక్సిక్’ ప్రేక్షకుల అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో చూడాలి.




# డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి యష్..

పాన్-ఇండియా స్టార్ యష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్‘ విడుదల కాకముందే వ్యాపార వర్గాల్లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్, డిజిటల్ బిజినెస్ డీల్స్ ప్రస్తుతం సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. నటుడిగానే కాకుండా ఈ చిత్రంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి యష్ అడుగుపెడుతున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ ‘మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్’ ద్వారా కేవీఎన్ ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న యష్, సినిమా లాభాల్లో వాటాతో పాటు కర్ణాటక ప్రాంత పంపిణీ హక్కులను తన వద్దే ఉంచుకున్నారు. కన్నడలో అతిపెద్ద స్థాయిలో థియేట్రికల్ రిలీజ్‌ను ప్లాన్ చేస్తున్నాడు యష్.ఇక తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి థియేట్రికల్ పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ ఏకంగా రూ. 120 కోట్లకు సొంతం చేసుకున్నట్టు సమాచారం. ఒక నాన్ -తెలుగు చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు లభించిన బిజినెస్ డీల్స్‌లో ఇది హయ్యెస్ట్ ధర అనే చెప్పాలి. ఈ సినిమా డిజిటల్ హక్కుల రేసు నుంచి డిజిటల్ దిగ్గజాలైన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ డిజిటల్ మరియు శాటిలైట్ హక్కులను దక్కించుకోవడానికి జీ స్టూడియోస్ చర్చలు జరుపుతోంది. తాజాగా రిలీజైన ట్రైలర్ తో అంచనాలను పెంచిన ఈ సినిమా ఈనెల 26న రిలీజ్ కానుంది. థియేటర్ బిజినేస్ లో రికార్డులు సృష్టిస్తున్న ఈ సినిమా ఓటీటీ రైట్స్ ఎవరు దక్కించుకుంటారో చూడాలి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**